

ప్రజా వాయిస్

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:111 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 12-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

కాలం మారినా, చక్రం తిరిగినా...
చెమటోడ్చే రైతన్న బతుకులో మాత్రం
చీకటి తొలగని వైనంపై
మీ కలం నుంచి వచ్చే
నిప్పులాంటి నిజం ఇదిగో:*
కాలం మారినా... కన్నీరు మారలేదు!*
మారిన కాలం పరుగులు పెట్టింది,
యాంత్రిక ప్రపంచం వేగం పెంచింది.
కానీ ఆకాశాన్ని నమ్ముకున్న అన్నదాత
బతుకు మాత్రం,అదే అప్పుల ఊబిలో...
అదే కన్నీటి సంద్రంలో!
పుడమి తల్లిని నమ్మి దున్నుతాడు,
పగలు రేయి తేడా లేకుండా శ్రమిస్తాడు.
పంట చేతికొచ్చే వేళకు ధర లేక
కుంగుతాడు,అకాల వర్షానికి కష్టమంతా
కళ్ళముందే కరిగిపోతే గుండె పగిలిపోతాడు.
సంవత్సరాలు మారుతున్నా,
ప్రభుత్వాలు మారుతున్నా...
రైతు ఎదుర్కొనే కష్టాల సుడిగుండం
మారడం లేదు.
పెట్టుబడి విపరీతంగా పెరిగింది,
కానీ చెమట విలువ మాత్రం
ఏనాడూ పెరగలేదు!
ఈ వ్యవస్థ మారాలి...
కేవలం కాలం మారితే సరిపోదు,
రైతన్న కళ్లలోని ఆవేదన తుడిచే
అండ దొరకాలి!
అప్పుడే ఈ దేశానికి నిజమైన
స్వాతంత్ర్యం,అన్నదాత బతుకులో నిజమైన
వెలుగు....

వారేవేణుగోపాల్., పాపన్నపేట

మైనారిటీల ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ కుట్ర



- సీఎం రేవంత్- మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లపై బీజేపీ నేతలకు సీఎం ప్రశ్నలు
- గుజరాత్‌లో ఎందుకు రిజర్వేషన్లు తొలగించడం లేదని నిలదీత
- ఓటర్ల జాబితా సవరణపై కేంద్రంపై తీవ్ర ఆరోపణలు
- మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- విద్య, ఉద్యోగాల్లో మైనారిటీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా

ప్రజా వాయిస్, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మైనారిటీలకు ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. 'సర్' (ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ) ప్రక్రియ పేరుతో మైనారిటీలు, దళితులు, పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

ఆజాద్ సేవలను గుర్తుచేసిన సీఎం

మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థ బలోపేతానికి పునాదులు వేశారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో విశ్వవిద్యాలయాలు, ఐఐటీల స్థాపనకు ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. ఆనాడు వేసిన పునాదుల వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా భారతీయులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తోందని, యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మారుస్తున్నామని వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. మైనారిటీ యువతలోనూ ప్రతిభావంతులు ఉన్నారని, వారికి తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు

మైనారిటీలకు విద్య, ఉద్యోగాల్లో కాంగ్రెస్

మిగతా 2లో




తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి

- వరుసగా అగ్రనేతల పర్యటనలు
- ఇప్పటికే హైదరాబాద్‌లో అమిత్ షా మహా పాదయాత్ర
- వచ్చే నెలలో ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు ఏర్పాట్లు
- నవంబర్ 18న కరీంనగర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు
- బండి సంజయ్ నేతృత్వంలో భారీగా జనసమీకరణకు సన్నాహాలు
- 'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్, ఇండీ కూటమి ప్రచారానికి కౌంటర్ ఇవ్వడమే లక్ష్యం

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు ఆదేశాలు

- కోర్టు ధిక్కరణ కేసులో వచ్చే మంగళవారం వ్యక్తిగతంగా హాజరుకావాలని డీజీపీకి ఆదేశం
- రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్ కూడా హాజరు కావాలి
- కోర్టు సమన్లు జారీ చేసినా విచారణకు రాకపోవడంపై అభ్యంతరం
- వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్ కొట్టివేత
- ఇద్దరినీ కోర్టు ముందు ప్రవేశపెట్టాలని డీజీపీకి ఆదేశాలు

2 లో



- కల్వకుంట్ల కవిత.
- విద్యావంతులు ఓటు హక్కు వినియోగించుకోవాలి
- సామాజిక న్యాయం కోసమే ఇద్దరు బీసీలకు అవకాశం
- హైదరాబాద్, నల్గొండ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన
- ఆకాశ్ కొల్లూరి, డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతు కోరిన కవిత
- గ్రాడ్యుయేట్లు డబ్బుకు ఓటు అమ్ముకోవద్దని విజ్ఞప్తి
- మండలిలో ప్రజల తరపున గొంతు వినిపిస్తామని వెల్లడి
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నదీ జలాలు, హామీల అమలుపై పోరాటం చేస్తామని ప్రకటన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి



ప్రజా వాయిస్, హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, నిద్రావస్థలో ఉన్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విద్యావంతులు ఒక అవకాశంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు.

రెండు స్థానాల్లో బీసీ అభ్యర్థులు


హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ఆకాశ్ కొల్లూరి, నల్గొండ–ఖమ్మం–వరంగల్ స్థానం నుంచి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను బరిలోకి దించినట్లు కవిత తెలిపారు. సామాజిక న్యాయంలో భాగంగా ఇద్దరు బీసీ అభ్యర్థులకే అవకాశం కల్పించామని చెప్పారు. ఆకాశ్ కొల్లూరి కుమ్మరి

మిగతా 2లో

టెలిగ్రామ్‌లో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల దందా

- హైదరాబాద్ కేంద్రంగా అన్ని రాష్ట్రాల ధ్రువీకరణ పత్రాల తయారీ.. ముగ్గురు నిందితుల అరెస్ట్
- ఎస్ఓటీ పోలీసుల ఆకస్మిక సోదాల్లో గుట్టురట్టు
- నిమిషాల్లోనే నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల తయారీ
- నిందితుల నుంచి 70 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం
- కంప్యూటర్ కూడా స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ప్రధాన నిందితుడిగా మహమ్మద్ యాహియా గుర్తింపు

2 లో





తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

- భట్టి విక్రమార్క
- కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని వెల్లడి
- 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం
- ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వరంగల్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో భట్టి సమావేశం

ప్రజా వాయిస్, వరంగల్: తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం కాజీపేటలో పర్యటించిన ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యారంగంలో కొత్త విధానాలు

దేశంలో మరెక్కడా లేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే

మిగతా 2లో

కాంగ్రెస్ నియామకాలపై ఎంపీ చామల వివరణ

- మహేశ్ గౌడ్‌తో ఎలాంటి విభేదాలు లేవు
- ఇద్దరం కలిసే 20 మందితో జాబితా రూపొందించాం
- మరికొన్ని పేర్లు చేర్చి కొత్త జాబితా విడుదల చేస్తాం
- రెండు మూడు రోజుల్లో నియామకాల ప్రకటన
- కొందరు ఎమ్మెల్యేలు ఫోన్ చేసిన మాట వాస్తవమే
- ఎమ్మెల్యేలు కొత్త నాయకులను తయారు చేయాలని చామల సూచన



2 లో



వివాహ బంధంలో అనిరుధ్ – కావ్యా మారన్

- గ్రీస్‌లో ఘనంగా పెళ్లి వేడుక
- ఒక్కటైన ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, కావ్యా మారన్
- గ్రీస్‌లో అంగరంగ వైభవంగా వివాహ వేడుక
- రజనీకాంత్, ఎం.కె. స్టాలిన్ సహా పలువురు ప్రముఖుల హాజరు
- సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు పంచుకున్న అనిరుధ్
- చెన్నైలో నవంబర్ 21న రిసెప్షన్ నిర్వహణకు ఏర్పాట్లు

2లో

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు ఆదేశాలు

ప్రజా వాయిస్, హైదరాబాద్:హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఆయనతో పాటు శంషాబాద్ తహసీల్దార్‌ను వచ్చే మంగళవారం హైకోర్టు ముందు హాజరుపరచాలని డీజీపీని ఆదేశించింది.సమన్లు జారీ చేసినా హాజరుకాకపోవడంపై అభ్యంతరంకోర్టు సమన్లు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరుకాకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్‌ను కోర్టు ముందు హాజరుపరచాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.

వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్ కొట్టివేత

విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావడం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రంగనాథ్, తహసీల్దార్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో వచ్చే మంగళవారం ఇద్దరూ కోర్టు ముందు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

టెలిగ్రామ్‌లో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల దందా

ప్రజా వాయిస్, హైదరాబాద్: నగరంలో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల తయారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. టెలిగ్రామ్ వేదికగా ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కేంద్రంగా అన్ని రాష్ట్రాలకు సంబంధించిన నకిలీ బర్త్ సర్టిఫికెట్లను నిమిషాల్లోనే తయారు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

ఎస్ఓటీ సోదాల్లో వెలుగులోకి..

నగరంలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ జరుగుతోందన్న సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో జీడిమెట్లకు చెందిన సలీం, మహమ్మద్ యాహియా, వెంకటేశ్ ఈ దందాలో పాల్గొంటున్నట్లు గుర్తించారు.

70 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం

టెలిగ్రామ్ ద్వారా వినియోగదారులతో సంప్రదింపులు జరుపుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 70 నకిలీ బర్త్ సర్టిఫికెట్లతో పాటు కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడిగా యాహియా

ఈ ముఠాలో మహమ్మద్ యాహియా ప్రధాన నిందితుడిగా వ్యవహరించగా, మిగిలిన ఇద్దరు అతనికి సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ అరెస్ట్ చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం ఆర్సిపురం సైబర్ క్రైమ్ పోలీసులకు అప్పగించారు. ఈ నకిలీ ధ్రువీకరణ పత్రాల దందా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

60 ఏళ్ల తర్వాత కొండగట్టు అంజన్న నిజరూప దర్శనం!

- **నవంబర్ 15 నుంచి 20 వరకు చందనోత్సవ, సంప్రోక్షణ మహోత్సవాలు**
- **20వ తేదీ ఉదయం 9.59 గంటలకు నిజరూప దర్శనం ప్రారంభం**
- **41 రోజుల పాటు స్వామివారి అసలు రూపాన్ని దర్శించుకునే అవకాశం**
- **తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం**
- **దర్శన క్యూలైన్లు, తాగునీరు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి**

ప్రజా వాయిస్, జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో అరుదైన ఆధ్యాత్మిక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. సుమారు ఆరు దశాబ్దాల తర్వాత నిర్వహించనున్న చందనోత్సవం, సంప్రోక్షణ మహోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు 41 రోజుల పాటు స్వామివారి మూలవిరాట్ నిజరూప దర్శనం కల్పించనున్నారు.

నవంబర్ 15 నుంచి ఉత్సవాలు

నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు చందనోత్సవం, సంప్రోక్షణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పవిత్ర క్రతువులో భాగంగా స్వామివారి మూలవిరాట్‌పై ఉన్న చందనం, సింధూరాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా తొలగించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

20న ఉదయం 9.59 గంటలకు నిజరూప దర్శనం

నవంబర్ 20వ తేదీ ఉదయం 9.59 గంటలకు స్వామివారి నిజరూప దర్శనం ప్రారంభం కానుంది. అనంతరం 41 రోజుల పాటు భక్తులకు స్వామివారి అసలు రూపాన్ని దర్శించుకునే అవకాశం కల్పించనున్నారు. బాల్యంలో ఈ ఉత్సవాన్ని చూసిన భక్తులకు జీవిత చరమాంకంలో మరోసారి దర్శించుకునే అవకాశం మాత్రమే దక్కుతుందనే విశ్వాసం భక్తుల్లో బలంగా ఉంది.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆరు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఈ అరుదైన ఉత్సవాన్ని దర్శించుకునేందుకు తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శన క్యూలైన్లు, తాగునీరు, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు.కోరిన కోర్కెలు తీర్చే కొండగట్టు అంజన్నగా భక్తులు కొలిచే స్వామివారి నిజరూప దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆధ్యాత్మికంగా అత్యంత విశిష్టమైన ఈ మహోత్సవాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం సన్నద్ధమవుతోంది.



కాంగ్రెస్ నియామకాలపై ఎంపీ చామల వివరణ

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో మీడియా ప్యానలిస్టులు, కోఆర్డినేటర్లు, అధికార ప్రతినిధుల నియామకాల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ వింగ్ చైర్మన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ప్రకటించిన 20 మందితో కూడిన జాబితాను పార్టీ నిలిపివేయడంతో గందరగోళం నెలకొంది. ఈ పరిణామంపై తాజాగా ఎంపీ చామల స్పందించి వివరణ ఇచ్చారు.

మహేశ్ గౌడ్‌తో విభేదాలు లేవు

బుధవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడిన చామల కిరణ్‌కుమార్ రెడ్డి.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో తనకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టం చేశారు. ఇద్దరం కలిసి జాబితాను రూపొందించామని తెలిపారు. అయితే చిన్న సాంకేతిక సమస్య కారణంగానే జాబితా నిలిచిపోయిందని వివరించారు. నియామకాలు ఆగిపోవని, మరికొన్ని పేర్లు చేర్చి కొత్త జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో కొత్త జాబితా ప్రకటించే అవకాశం ఉందని చెప్పారు.

ఎమ్మెల్యేలు అడ్డుకోవద్దు

పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు కల్పిస్తుంటే కొందరు ఓర్చుకోలేకపోతున్నారని చామల వ్యాఖ్యానించారు. కొందరు ఎమ్మెల్యేలు తనకు ఫోన్ చేసిన విషయం నిజమేనని అంగీకరించారు. తమకు తెలియకుండా జాబితా విడుదల చేశారంటూ కొందరు ఎమ్మెల్యేలు ఫోన్ చేసి మాట్లాడారని తెలిపారు. ఎమ్మెల్యేలు పరిస్థితిని అర్థం చేసుకోవాలని, పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు కల్పించే విషయంలో అడ్డంకులు సృష్టించవద్దని సూచించారు.

నాయకులను తయారు చేయాలి

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కొత్త నాయకులను తయారు చేయాలని చామల అభిప్రాయపడ్డారు. కొందరు ఎమ్మెల్యేలు అభద్రతాభావంతో ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. సామ రామ్మోహన్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్ గురించి తనకు ముందుగా సమాచారం లేదని తెలిపారు. కొత్త జాబితా విడుదలపై చామల చేసిన ప్రకటనతో కాంగ్రెస్ నియామకాల వ్యవహారం మరోసారి ఆసక్తికరంగా మారింది.

తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు.

27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం

రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకేసారి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ తరహా కార్యక్రమం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనూ ప్రత్యేకమని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

వరంగల్‌లో పలు కార్యక్రమాలు

కాజీపేట పర్యటనలో భాగంగా మడికొండలో స్థానిక కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. హనుమకొండలోని నక్కలగుట్టలో మైరా (MYRAA) ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

మొదటి పేజీ తరువాయి

సామాజిక వర్గానికి చెందినవారని, గతంలో ఈ సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు.తమ అభ్యర్థులు చదువుకున్న యువకులని, ఒకరు ఉస్మానియా యూనివర్సిటీ, మరొకరు కాకతీయ యూనివర్సిటీ నేపథ్యం కలిగినవారని తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా బలమైన నేపథ్యం లేకపోయినా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగారని వివరించారు.

డబ్బుకు ఓటు వేయొద్దు

గ్రాడ్యుయేట్లు కూడా డబ్బులు తీసుకుని ఓటు వేస్తారనే అపవాదును తొలగించుకోవాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. రూ.200 కోట్లు ఖర్చు పెట్టయినా తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముఖ్యమంత్రి చెబుతున్నారని ఆరోపించారు. విద్యావంతులు డబ్బుకు ఓటు వేస్తే వ్యవస్థలో అవినీతి మరింత పెరుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది ఏదో ఒక డిగ్రీ పొందినవారున్నారని, వారంతా ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్లంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మండలిలో ప్రజల గొంతుకగా ఉంటాం

శాసన మండలిలో మొత్తం 40 మంది సభ్యులుంటే గ్రాడ్యుయేట్ల ద్వారా ఎన్నికయ్యే సభ్యులు ముగ్గురేనని కవిత గుర్తుచేశారు. ఆ ముగ్గురూ ప్రజల సమస్యలపై పనిచేసే వారై ఉండాలని అన్నారు. మండలిలో ప్రస్తుతం సమర్థవంతమైన ప్రతిపక్షం లేదని, బీఆర్ఎస్ సభ్యుల్లో సగానికిపైగా కాంగ్రెస్‌లో చేరిపోయారని ఆరోపించారు. బీజేపీ సభ్యులు కూడా కాంగ్రెస్‌తో లోపాయికారీ ఒప్పందంలో ఉన్నారని విమర్శించారు. తమ అభ్యర్థులను గెలిపిస్తే గ్రాడ్యుయేట్ల సమస్యలపై మండలిలో గళమెత్తుతామని చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి నదీ జలాల వరకు పోరాటంతమ ఎన్నికల పోరాటం

కేవలం ఎమ్మెల్సీ స్థానాలకే పరిమితం కాదని కవిత స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, నదీ జలాల సాధన, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై పోరాడుతామని తెలిపారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల పరిధిలోని దాదాపు 75 నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం నెలకొందని చెప్పారు. భావసారూప్యత కలిగిన పార్టీల మద్దతు కోరతామని వెల్లడించారు.మహిళలకు రిజర్వేషన్లు ఉన్నా లేకపోయినా తమ పార్టీ తరఫున 33 నుంచి 50 శాతం సీట్లు కేటాయిస్తామని కవిత ప్రకటించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి మహిళా అభ్యర్థిని నిలబెట్టే అవకాశం ఉన్నప్పటికీ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించామని వివరించారు. పార్టీ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, ఎన్నికల సంఘం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

మైనారిటీల ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ కుట్ర

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని సీఎం గుర్తుచేశారు. ఈ రిజర్వేషన్ల ద్వారా ఎంతోమంది యువత వైద్యులు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదిగారని పేర్కొన్నారు. మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ కేంద్రం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పాతబస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

హైదరాబాద్ పాతబస్తీ భవిష్యత్తు అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పాతబస్తీలో మెట్రో రైలు పనులను వేగవంతం చేయడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనంతో ఆ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. మూసీ పరిసరాల్లో రాత్రి వేళల్లో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.మొత్తంగా మైనారిటీల రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా సవరణ, విద్యా సంక్షేమం, పాతబస్తీ అభివృద్ధి అంశాలపై సీఎం చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

వివాహ బంధంలో అనిరుధ్ – కావ్యా మారన్

ప్రజా వాయిస్, హైదరాబాద్:ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యజమాని కావ్యా మారన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బుధవారం (నవంబర్ 11) గ్రీస్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ప్రముఖుల సమక్షంలో వీరి వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. సూపర్‌స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు

వివాహానికి సంబంధించిన ఫొటోలను అనిరుధ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'జీవితంలో ఒక్కసారే వచ్చే సందర్భం.. జీవితాంతం.. 11.11' అంటూ భావోద్వేగపూరిత వ్యాఖ్యను జోడించారు. ఈ ఫొటోలు ప్రస్తుతం అభిమానులు, నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నవంబర్ 21న చెన్నైలో రిసెప్షన్ వేడుక నిర్వహించనున్నట్లు సమాచారం.

ఎవరీ కావ్యా మారన్?

ప్రముఖ వ్యాపారవేత్త, సన్ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కుమార్తె కావ్యా మారన్. ఆమె సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. సన్ గ్రూప్ మీడియా వ్యాపారంలోనూ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా స్టేడియంలో జట్టును ప్రోత్సహిస్తూ ఆమె తరచూ వార్తల్లో నిలుస్తుంటారు.

టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా అనిరుధ్

మరోవైపు అనిరుధ్ రవిచందర్ భారతీయ సినీ పరిశ్రమలో ప్రముఖ సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ చిత్రాలకు కూడా సంగీతం అందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. గత కొంతకాలంగా అనిరుధ్, కావ్యా మారన్ ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా పెద్దల అంగీకారంతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

లంచం కేసులో మాజీ సీఐకి జైలు శిక్ష

- **15 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన ట్రయల్ కోర్టు**
- **మాజీ సీఐ ధారావత్ బాలాజీని దోషిగా నిర్ధారించిన కోర్టు**
- **2011లో లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ కేసు**
- **ఒక్కో అభియోగంపై ఏడాది చొప్పున శిక్ష**
- **రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశం**
- **రూ.10 వేల జరిమానా కూడా విధింపు**

ప్రజా వాయిస్, నిజామాబాద్:లంచం డిమాండ్ చేసిన కేసులో మాజీ సీఐ ధారావత్ బాలాజీకి ట్రయల్ కోర్టు జైలు శిక్ష విధించింది. 2011లో నమోదైన ఈ కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం, సుమారు 15 ఏళ్లకు కోర్టు తీర్పు వెలువరించింది. లంచం కేసులో బాలాజీని దోషిగా నిర్ధారిస్తూ కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది.

2011లో ఏసీబీ కేసు నమోదు

గతంలో డిచ్‌పల్లిలో సీఐగా విధులు నిర్వహించిన ధారావత్ బాలాజీ ఓ కేసు విషయంలో బాధితుల నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధితులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 2011లో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒక్కో అభియోగంపై ఏడాది శిక్ష

ఈ కేసులో విచారణ పూర్తిచేసిన ట్రయల్ కోర్టు ధారావత్ బాలాజీని దోషిగా నిర్ధారించింది. ఒక్కో అభియోగంపై ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని స్పష్టం చేసింది. దీంతో పాటు రూ.10 వేల జరిమానా కూడా విధించింది.దీర్ఘకాలంగా కొనసాగిన ఈ కేసులో కోర్టు తీర్పు వెలువడటంతో అవినీతి ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణను కేంద్రంగా చేసుకుని బీజేపీ తన రాజకీయ కార్యకలాపాలను విస్తృతం చేస్తోంది. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికలే లక్ష్యంగా జాతీయ స్థాయి నేతల పర్యటనలకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహా పాదయాత్రలో పాల్గొనగా, వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే సమయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

కరీంనగర్‌పై ప్రత్యేక దృష్టి

ఉత్తర తెలంగాణ రాజకీయాలకు కీలక కేంద్రంగా ఉన్న కరీంనగర్‌ను బీజేపీ తన తదుపరి కార్యక్రమానికి వేదికగా ఎంచుకుంది. నవంబర్ 18న కరీంనగర్‌లో నిర్వహించనున్న భారీ మహా పాదయాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొననున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా కరీంనగర్ జిల్లాకు వస్తుండటంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు లక్ష మంది ప్రజలు, పార్టీ కార్యకర్తలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎస్ఐఆర్'పై ప్రచారానికి కౌంటర్

'ఎస్ఐఆర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలను వివరించాలనే ఉద్దేశంతోనే మహా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు

కరీంనగర్‌లో గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని బండి సంజయ్ ప్రకటించారు.

దక్షిణాదిపై జాతీయ నాయకత్వం ఫోకస్

దక్షిణ భారతదేశంలో కర్ణాటకతో పాటు తెలంగాణపై కూడా బీజేపీ జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వరుసగా కేంద్ర, జాతీయ స్థాయి నేతల పర్యటనలు, భారీ బహిరంగ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ పర్యటనలు, కార్యక్రమాల ద్వారా తెలంగాణలో రాజకీయంగా ఎలాంటి ప్రభావం ఏర్పడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ తెచ్చిన కరువు..
కేసీఆర్ ఉంటే నీళ్ల జాతర: కేటీఆర్

- **నిర్మల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రైతు గర్జన సభ**
- **కాంగ్రెస్ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపణ**
- **తెలంగాణలో చెరువులు ఎండిపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీత**
- **రైతుబంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై విమర్శలు**
- **తన గడ్డంపై కాంగ్రెస్ నేతలకు ఎందుకంత ఆందోళన అంటూ ఎద్దేవా**

ప్రజా వాయిస్, నిర్మల్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. నిర్మల్‌లో బుధవారం బీఆర్ఎస్ నిర్వహించిన 'రైతు గర్జన' బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు.

కేసీఆర్ ఉద్యమంతో నిర్మల్‌కు అనుబంధం

నిర్మల్ సరస్వతీ మాత కొలువుదీరిన పుణ్యభూమి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ చారిత్రక ప్రాంతానికి, కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని తొలుత ప్రకటించింది ఇక్కడేనని గుర్తుచేశారు. 1996లోనే నిర్మల్ వేదికగా తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ మాట్లాడారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 46 వేల చెరువులకు ఆయన జీవం పోశారని చెప్పారు.

తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు?

కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ కంటే ఎక్కువ సంక్షేమం అందిస్తామని చెప్పి, అనేక హామీలతో అధికారంలోకి వచ్చారని కేటీఆర్ విమర్శించారు. ''ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు?'' అంటూ ప్రశ్నించారు. ఏపీలో చంద్రబాబు నాయుడు 700 కిలోమీటర్ల మేర నీళ్లు పారించారని, తెలంగాణలో మాత్రం చెరువులు ఎండిపోతున్నాయని ఆరోపించారు. గోదావరి ప్రవహించే ప్రాంతంలో కరువు పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయని నిలదీశారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన కరువని విమర్శించారు.

గడ్డంపై ఫికర్.. ప్రజా సమస్యలపై లేదా?

రాష్ట్రంలోని సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ నాయకులకు తన గడ్డంపై మాత్రం ఆందోళన ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల తన గడ్డంపై చేసిన వ్యాఖ్యలకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే కరువు అంశంపై కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

కేసీఆర్ వస్తే నీళ్ల జాతర

కేసీఆర్ పాలనలో రైతుల కష్టాలు తెలిసిన నాయకుడిగా వ్యవహరించారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పన్ను రద్దు చేయడంతో పాటు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసిందని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉంటే రాష్ట్రంలో నీళ్ల జాతర ఉండేదని వ్యాఖ్యానించారు.

సంక్షేమ పథకాలు నిలిపివేశారు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను నిలిపివేసిందని, రైతుబంధు సాయం కూడా మూడు విడతల్లో అందించలేదని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ త్వరలోనే ప్రజల ముందుకు వస్తారని, అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతారని అన్నారు. నిర్మల్‌లో కొందరు నాయకులు పార్టీ మారినప్పటికీ, కార్యకర్తలు మాత్రం బీఆర్ఎస్‌ను వీడలేదని పేర్కొన్నారు.



కాంగ్రెస్ అంటే కొబ్బరికాయ కొట్టుడు?

- ఒక్క పని కూడా సక్రమంగా చేయలేని కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి మల్లారెడ్డి విమర్శలు!

ప్రజావాయిస్, నాగారం: మేడ్చల్ నియోజకవర్గంలోని నాగారం డివిజన్ పరిధిలో ప్రజా సాయి గార్డెన్, శివశంకర్ కాలనీ, సాయి కాలనీతో పాటు పలు కాలనీలలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శివశంకర్ కాలనీలో రూ.కోటి వ్యయంతో మంజూరై కొనసాగుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం ఆయా కాలనీలలో పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాలనీలలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తూ.. కాంగ్రెస్ అంటే కొబ్బరికాయ కొట్టుడుకే పరిమితమైందని, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో విఫలమవుతోందని మల్లారెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

గ్రామపంచాయతీల్లో ఏం జరుగుతోంది?

- జవాబుదారీతనం ఎవరిది?
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు
- ఎంపీడీఓల తనిఖీలు ఎక్కడ?
- జిల్లా అధికారుల సమీక్షలు ఏవి?

ప్రజా వాయిస్ మంథని (ప్రత్యేక కథనం రౌతు సంతు) గ్రామపంచాయతీ పాలనలో పారదర్శకత, పర్యవేక్షణ, జవాబుదారీతనం కీలకం. కానీ మంథని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం ఏం జరుగుతోంది? ఏ అభివృద్ధి పనులు చేపడుతున్నారు? ప్రభుత్వ భూముల పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై ప్రజల్లో అయోమయం నెలకొంటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఏది?

గ్రామపంచాయతీల పనితీరును ఎంపీడీఓలు, డీఎల్పీఓలు, డీపీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. గత ఏడు నెలల్లో అధికారులు ఎన్ని గ్రామాలను సందర్శించారు? ఎన్ని తనిఖీలు నిర్వహించారు? సమస్యలను గుర్తించి ఎన్ని పరిష్కరించారు? అనే వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువా?

గ్రామాల్లో పాఠశాలలు, వైద్య కేంద్రాలు, పార్కులు, క్రీడా మైదానాలు, మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూములు ఎంతో అవసరం. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, గుట్టలు అన్యాక్రాంతమవుతున్నాయనే ఆరోపణలు అందోళన కలిగిస్తున్నాయి. పార్కుల కోసం కేటాయించిన స్థలాల విషయంలోనూ స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై రెవెన్యూ, సర్వే అధికారులు సమగ్ర పరిశీలన చేపట్టాలి. గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోయినా, నిధుల వినియోగంపై ఆరోపణలు వచ్చినా, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనా బాధ్యత ఎవరిది? గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం, మండల స్థాయిలో ఎంపీడీఓ, డివిజన్ స్థాయిలో డీఎల్పీఓ, జిల్లా స్థాయిలో డీపీఓ, కలెక్టర్ పర్యవేక్షణ ఉండాలి. ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడు సమస్య పరిష్కరించి సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.



కలెక్టర్ దృష్టి సారించాలి!

మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి. గత ఏడు నెలల అధికారుల పర్యటనలు, తనిఖీల వివరాలు పరిశీలించాలి. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అభివృద్ధి పనులు, పంచాయతీ నిధుల వినియోగంపై గ్రామాల వారీగా నివేదికలు తెప్పించుకోవాలి. గ్రామపంచాయతీలు ప్రజల కోసం పని చేయాలి.. ప్రభుత్వ ఆస్తులు ప్రజల భవిష్యత్తు కోసం కాపాడాలి. గ్రామంలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియాలి. తప్పు జరిగితే బాధ్యత వహించేది ఎవరో స్పష్టంగా ఉండాలి. ప్రజలకు పాలనపై హక్కు ఉన్నప్పుడు అధికారులకు జవాబుదారీతనం తప్పనిసరి. మంథని నియోజకవర్గంలో ఈ పర్యవేక్షణ వ్యవస్థను జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా గాడిలో పెడుతుందా? అన్నదే ప్రజల ప్రశ్న...

విద్య ద్వారానే సమాజ అభివృద్ధి



- ప్రపంచ స్థాయిలో తెలంగాణ విద్యార్థులు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం ఉప ముఖ్యమంత్రి భట్టి
- రూ.10 కోట్లతో కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులందరికీ సమాన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి విద్య ద్వారానే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమని, తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. బుధవారం కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశం ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసేందుకు సోషియో ఎకనామిక్ అండ్ పొలిటికల్ ఎంప్లాయ్‌మెంట్ సర్వే నిర్వహించిందని తెలిపారు. ఈ సర్వే విశ్లేషణలో సమాజంలోని కుటుంబాలు, కులాలు, వర్గాలు అభివృద్ధి చెందడానికి విద్యే ప్రధానమైన సాధనమని స్పష్టమైందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో విద్యారంగంలో పటిష్టమైన పునాదులు వేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ ప్రారంభించిన 'యంగ్ ఇండియా' పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలకు ఒకేసారి అనుమతులు మంజూరు చేశామని, ఒక్కో పాఠశాలకు సుమారు రూ.200 కోట్ల వ్యయంతో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.ఈ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా ప్రత్యేక విద్యావిధానాన్ని రూపొందించామని చెప్పారు. ఆంగ్ల మాధ్యమ బోధన, ఆధునిక సదుపాయాలు, విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యను అందించి సమానత్వం, సామాజిక సమైక్యత, సోదరభావం పెంపొందించేలా ఈ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని వెల్లడించారు.అదేవిధంగా ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించే ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన, ఆధునిక తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, షూస్, టైలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు ఉచితంగా అందిస్తామని వివరించారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను సెమీ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తామని, విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే అందిస్తామని చెప్పారు. వైద్య నిపుణుల సూచనలతో రూపొందించిన అల్పాహారంలో వారానికి ఆరు రోజులు పౌష్టికాహారం, ప్రత్యామ్నాయ రోజుల్లో పాలు, రాగిజావ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులను ప్రభుత్వ రవాణా సదుపాయంతో తిరిగి వారి ఇళ్లకు చేర్చుతామని పేర్కొన్నారు.పిల్లలు విద్యతో పాటు తల్లిదండ్రులతో కుటుంబ అనుబంధాన్ని కూడా కొనసాగించాలనే ఉద్దేశంతోనే సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క వివరించారు. రాత్రి వేళల్లో కుటుంబ సభ్యులతో గడుపుతూ, పగటిపూట అత్యుత్తమ విద్యా సదుపాయాలను పొందేలా ఈ విధానం ఉపయోగపడుతుందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పరిశుభ్రమైన వాతావరణంలో కేంద్రీకృత వంటశాలల ద్వారా పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, నాయకులు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా చేయడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎండీ అయూబ్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, టీజీఎన్‌పీడీసీఎల్ ఎండీ వరుణ్ రెడ్డి, పోలీస్ కమిషనర్ శ్వేత, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అంతా మా ఇష్టం..మమ్మల్ని ఆపేదెవరు?

- 111 జీవోకు తూట్లు.. ప్రెస్టేజ్ లో అక్రమ నిర్మాణాల జోరు!
- కేతిరెడ్డిపల్లి చాకలిగూడలో అడ్డూ అదుపూ లేకుండా నిర్మాణాలు
- రంగులేస్తే అక్రమాలు సక్రమాలవుతాయా..?
- నిర్మాణం పూర్తికాకముందే హడావుడి!
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా నోరు మెదపని అధికారులు.. మౌనం వెనుక మర్మమేమిటి?
- అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని స్థానికుల డిమాండ్!

మొయినాబాద్(ప్రజావాయిస్): అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేదెవరు? అడుకునేదెవరు? అన్నట్లుగా కేతిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని చాకలిగూడ ప్రెస్టేజ్ లో అక్రమ నిర్మాణాలు సాగుతున్నా ప్రభుత్వ నిబంధనలు మాకేం పట్టవు.. అధికారుల పర్యవేక్షణ మాకేం అక్కర్లేదు అన్న చందంగా నిబంధనలను పక్కనపెట్టి అడ్డూ అదుపూ లేకుండా కట్టడాలు వెలుస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమాలకు రంగులేసి సక్రమాలుగా చూపించే ప్రయత్నం..?

ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే.. నిర్మాణ పనులు పూర్తికాకముందే భవనాలకు రంగులు వేస్తున్నారు. రంగులు వేస్తే నిబంధనల ఉల్లంఘనలు మాయమై పోతాయా..? నిర్మాణాలకు కొత్త రూపు వస్తే అనుమతులు ఉన్నట్లేనా..? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణాలు మాత్రం చకచకా సాగుతున్నాయి.. అడ్డుకోవాల్సిన అధికారుల నుంచి మాత్రం కనీస స్పందన కనిపించడం లేదు స్థానికులు గుర్రుగా ఉన్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొనాలి!

ప్రెస్టేజ్‌లో వెలుస్తున్న నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిర్మాణ అనుమతులు, 111 జీవో నిబంధనలను పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే నిర్మాణ పనులు నిలిపివేసి, చట్టప్రకారం కూల్చివేత చర్యలు చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ జీవోను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థే మౌనంగా ఉంటే.. ఇక నిబంధనలకు విలువెక్కడ? నిర్మాణాలు పూర్తయ్యాక మేల్కొనే బదులు ఇప్పుడే స్పందించి అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపిస్తారా? లేక నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూస్తారా? అన్నది ఉన్నతాధికారులే నిగ్గు తేల్చాలి!

ములుగు జిల్లా పోలీస్ శాఖకు జీవితాంతం రుణపడి ఉంటా

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న నన్ను ఆదుకొని ప్రాణాలు కాపాడారు
- నా కుటుంబానికి అండగా నిలిచారు
- పోలీస్ యూనియన్ నాయకులు, జిల్లా ఎస్పీకి కానిస్టేబుల్ యాప సారయ్య కృతజ్ఞతలు



ప్రజా వాయిస్ ములుగు జిల్లా, నవంబర్ 11:/ ఆపదలో ఉన్న పోలీసు కుటుంబానికి అండగా నిలవడంలో ములుగు జిల్లా పోలీస్ శాఖ మరోసారి మానవత్వాన్ని చాటుకుందని కానిస్టేబుల్ యాప సారయ్య తెలిపారు. తనకు ప్రాణాపాయం ఏర్పడిన సమయంలో సకాలంలో స్పందించి, మెరుగైన వైద్యం అందేలా కృషి చేసి ప్రాణాలు కాపాడిన పోలీస్ శాఖకు, పోలీస్ యూనియన్ నాయకులకు, జిల్లా ఎస్పీకి జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.ఈ నెల 19వ తేదీన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడ గ్రామానికి చెందిన తాను విధులకు హాజరయ్యేందుకు బయలుదేరి వెళ్తుండగా, నల్లబెల్లి మండలం శనిగారం గ్రామ పరిధిలో భూపాలపల్లి ప్రాంతానికి చెందిన వాహనదారుడు తన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నానని తెలిపారు. సమాచారం అందుకున్న ములుగులో విధులు నిర్వహిస్తున్న తోటి కానిస్టేబుల్ శంకర్ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని తనను ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అక్కడ వైద్య ఖర్చుల కోసం రూ.70 వేల చెల్లింపు అవసరమని చెప్పడంతో పోలీస్ యూనియన్ నాయకులు విజయ్, తిరుపతి, క్రాంతికుమార్‌లకు సమాచారం అందించగా, వారు వెంటనే స్పందించి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఎలాంటి చెల్లింపులు చేయకుండానే హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించేలా సహకరించారని వివరించారు.

"నాకు ప్రాణం పోసింది పోలీస్ కుటుంబం.. నా కుటుంబానికి అండగా నిలిచింది పోలీస్ యూనియనే" అని సారయ్య భావోద్వేగంగా పేర్కొన్నారు.

పోలీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆసుపత్రి యాజమాన్యంతో పాటు ఆరోగ్య పథకం సిబ్బందితో నిరంతరం మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. తోటి కానిస్టేబుల్ శంకర్ నుంచి యూనియన్ నాయకుల వరకు ప్రతి ఒక్కరూ తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించి ఆదుకున్నారని అన్నారు. ఈ రోజు తాను ప్రాణాలతో ఉండి తన కుటుంబంతో కలిసి ఉన్నానంటే అందుకు జిల్లా ఎస్పీ, పోలీస్ యూనియన్ నాయకులు, పోలీస్ శాఖ అందించిన సహకారమే కారణమని స్పష్టం చేశారు. తన కుటుంబం తరఫున వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, తనలాంటి ఆపదలో ఉన్న పోలీసు సిబ్బందిని ఆదుకోవడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందనే దానికి తానే ప్రత్యక్ష సాక్షినని కానిస్టేబుల్ యాప సారయ్య పేర్కొన్నారు.




వల్మిడి–తీగారం రోడ్డు పనులు ప్రారంభం

- రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన గ్రామ ప్రజాప్రతినిధులు.

ప్రజా వాయిస్ / పాలకుర్తి నవంబర్ 11.జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామం నుంచి తీగారం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. రహదారి పనులు పూర్తయితే పల్మిడి నుంచి తీగారం గ్రామానికి రాకపోకలు సాగించే ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది.



రహదారి పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.



రిటైర్డ్ ఉద్యోగులతో నిరుద్యోగులకు అన్యాయం!

- అవుట్ సోర్సింగ్ పేరుతో మళ్లీ ఉద్యోగాలు
- పెన్షన్ తో పాటు రూ.50 వేల వరకు వేతనాలు?
- ఉద్యోగాలు లేక ఆందోళన చెందుతున్న యువత
- నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని జేఏసీ డిమాండ్

జావాయిస్ ప్రత్యేక కథనం / వికారాబాద్ బ్యూరో:ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన వారే తిరిగి అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తుండటంపై నిరుద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పెన్షన్ పొందుతున్న వారికి మళ్లీ నెలకు రూ.50 వేల వరకు వేతనాలు చెల్లిస్తూ నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి.

గురుకులాల్లోనూ వారే!

గ్రామస్థాయి నుంచి సచివాలయాల వరకు పలు ప్రభుత్వ విభాగాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లోనూ రిటైర్డ్ ఉద్యోగులు వివిధ హోదాల్లో కొనసాగుతున్నారని జేఏసీ పేర్కొంటోంది. విజిలెన్స్ అధికారులు, ఆర్‌సీవోలు, గురుకుల ప్రధాన కార్యాలయాల్లోనూ వారికి అవకాశాలు కల్పించడం వల్ల అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఉద్యోగాలు లేక యువతలో ఆందోళన!

నిరుద్యోగ సమస్యతో యువత తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతోందని, వివాహాలు చేసుకోలేక, కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేక కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల పునర్నియామకాలపై సమీక్ష చేపట్టి, వారి స్థానంలో అర్హులైన నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ, ఓయూ విద్యార్థి జేఏసీ డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టడంతో పాటు అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నాయి.

నీరుకుళ్ల పంచాయతీలో లేఖ వివాదం.!

- సర్పంచ్ పేరుతో దరఖాస్తు.. కార్యదర్శి పాత్రపై సందేహాలు
- రూ.8.78 లక్షల చెల్లింపుల లెక్కలపై సమాధానాలేవీ.?
- లెటర్ ప్యాడ్ పై సర్పంచ్ భర్త ఫోన్ నంబర్.. దరఖాస్తు ఇచ్చిందెవరు.?
- అధికారుల వివరణల్లో తేడాలు.. అసలు లేఖ వెనుక ఎవరున్నారు.?
- అక్టోబర్ 31న దరఖాస్తు.. నవంబర్ 6న వార్తలు
- సమాచారం లీక్ ఎక్కడి నుంచి.?



ప్రజా వాయిస్, ఆత్మకూరు: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామపంచాయతీలో చెల్లింపుల వ్యవహారం కొత్త వివాదానికి దారితీసింది. సర్పంచ్ లెటర్ ప్యాడ్‌పై ఎంపీఓకు అందిన దరఖాస్తు ఇప్పుడు పలు ప్రశ్నలకు కేంద్రబిందువైంది. సర్పంచ్ పేరుతో పంచాయతీ కార్యదర్శి దరఖాస్తు అందజేసినట్లు ప్రచారం జరుగుతుండటంతో లేఖ రాసిందెవరు. అందజేసిందెవరు. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు లెటర్ ప్యాడ్‌పై సర్పంచ్ భర్త ఫోన్ నంబర్ ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అధికారుల మాటల్లో తేడాలెందుకు.?

ఈ వ్యవహారంపై ఎంపీడీఓను వివరణ కోరినప్పుడు తొలుత సర్పంచ్ భర్త పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఇచ్చినట్లు తెలిపినట్లు సమాచారం. రెండో రోజు మాత్రం సర్పంచ్ గానీ, ఆమె భర్త గానీ రాలేదని, సర్పంచ్ సంతకంతో కార్యదర్శే దరఖాస్తు అందజేసినట్లు వివరించినట్లు తెలుస్తోంది. ఒకే వ్యవహారంపై రెండు రకాల వివరణలు రావడంతో అసలు వాస్తవం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కార్యదర్శికి ఆ అధికారం ఉందా.?

పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ ఉద్యోగి. సర్పంచ్ పేరుతో ఉన్న దరఖాస్తును కార్యదర్శి స్వయంగా తీసుకెళ్లి ఎంపీఓకు అందజేయడంలో ఎలాంటి నిబంధనలు వర్తిస్తాయి.. దరఖాస్తుదారుడి సమక్షం అవసరమా.. సంతకంతో కూడిన లేఖను ప్రతినిధిగా అందజేయవచ్చా.. అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. కార్యదర్శి పాత్రపై వస్తున్న సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే.

ఆరు రోజుల వ్యవధిలో సమాచారం ఎలా చేరింది.?

అక్టోబర్ 31న దరఖాస్తు అందజేసినట్లు చెబుతుండగా, నవంబర్ 6న పత్రికల్లో ఈ వ్యవహారం ప్రచురితమైంది. మధ్యలో ఆరు రోజుల వ్యవధిలో దరఖాస్తు వివరాలు బయటకు ఎలా వచ్చాయి. అధికారికంగా అందిన సమాచారం పత్రికలకు చేరవేసింది ఎవరు. అసలు దరఖాస్తు ప్రతిని ఎవరు అందించారు. అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి.

రూ.8.78 లక్షల చెల్లింపులపై ఆరా.!

పంచాయతీ చెల్లింపుల వ్యవహారంలో రూ.8,78,633 మొత్తానికి సంబంధించిన లెక్కలు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మొత్తానికి సంబంధించిన బిల్లులు, వోచర్లు ఎక్కడున్నాయి.. ఏ పనుల కోసం నిధులు ఖర్చు చేశారు. ఏ పాలకవర్గం హయాంలో చెల్లింపులు జరిగాయి.. నిధుల వినియోగానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయా.. అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

పత్రికలకు సమాచారం ఇచ్చిందెవరు.?

ఈ వ్యవహారంపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో సమాచారం అందించిన వారి వివరాలపైనా చర్చ సాగుతోంది. అధికారులు వెల్లడించిన వివరాల ఆధారంగానే కథనాలు వచ్చాయా.. దరఖాస్తు ప్రతిని పరిశీలించిన తర్వాతే ప్రచురించారా.. అన్న అంశాలపై స్పష్టత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే సమాచారం ఇచ్చిన వ్యక్తి ఎవరనే దానికంటే, దరఖాస్తులోని అంశాలు, చెల్లింపుల లెక్కల వాస్తవాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల విచారణ ఏదీ.?

నీరుకుళ్ల పంచాయతీలో అసలు దరఖాస్తుదారుడు ఎవరు, లేఖను కార్యదర్శి ఏ ప్రాతిపదికన అందజేశారు. అధికారుల వివరణల్లో తేడాలకు కారణమేంటి రూ.8,78,633 చెల్లింపులకు సంబంధించిన ఆధారాలేమిటి? అనే అంశాలపై జిల్లా పంచాయతీరాజ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరోపణలకు తెరదించి, రికార్డుల ఆధారంగా నిజానిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.



లాడ్జి గదిలో జోరుగా పేకాట.. పోలీసుల ఆకస్మిక దాడి

- అర్ధరాత్రి టాస్క్ ఫోర్స్ మెరుపు ఆపరేషన్
- 10 మంది అరెస్ట్.. రూ.1.36 లక్షల నగదు స్వాధీనం


ప్రజా వాయిస్ గోదావరిఖని పట్టణంలో అక్రమ పేకాట కార్యకలాపాలపై పోలీసులు కొరడా ఝళిపించారు. ఐబీ కాలనీలోని వినాయక్ రెసిడెన్సీ లాడ్జిలో అర్ధరాత్రి నిర్వహించిన ఆకస్మిక దాడిలో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,36,130 నగదుతో పాటు పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ రెసిడెన్సీ లాడ్జిలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. గోదావరిఖని పన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి లాడ్జిపై సంయుక్తంగా దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకుని వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఎస్.ఎం. ఖాన్ (ఎన్టీపీసీ సండే మార్కెట్), టి. నర్సింగరావు (జంగాం), పి. తిరుపతి (పవర్‌హౌస్ కాలనీ), ఎం. కుమార్ (ప్రగతినగర్), కె. కిరణ్ (రామగుండం), వి. సతీష్ (బాపూజీనగర్), ప్రవీణ్ (గౌతమీనగర్), ఆర్. మణి (మార్కండేయ కాలనీ), ఎస్.కె. భాషి (మార్కండేయ కాలనీ), కె. రాజ్‌కుమార్ (తిలక్‌నగర్) ఉన్నారు. పట్టుబడిన పది మందిని, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణంలో అక్రమ పేకాట, జూదం కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

హామీకి రూపం.. భక్తికి ప్రాణం!

- ఎన్నికల వేళ ఇచ్చిన మాటకు కార్యరూపం.
- అయ్యప్ప స్వాములకు నూతన సన్నిధానం ఏర్పాటు
- భక్తి విశ్వాసాలకు గౌరవం
- సంకల్పాన్ని సాకారం చేసిన రెడ్డిపల్లి సర్పంచ్ షాపురం రాజు
- సర్పంచ్ చొరవపై సన్నిధాన స్వాములు, యువత హర్షాతిరేకం

మొయినాబాద్ (ప్రజావాయిస్): నాయకత్వానికి అసలైన అర్థం పదవిని అధిరోహించడంలో కాదు.. ప్రజలకు ఇచ్చిన మాటను బాధ్యతగా నెరవేర్చడంలో ఉంటుంది. ఎన్నికల వేళ చేసిన వాగ్దానాన్ని కాలగర్భంలో కలిసిపోనివ్వకుండా కార్యరూపంలోకి తీసుకొచ్చి తన సంకల్పాన్ని చాటుకున్నారు రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ షాపురం రాజు (మాణిక్యం).అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేక సన్నిధానం ఏర్పాటు చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గ్రామంలో నూతన సన్నిధాన భవనాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షకు గౌరవం ఇస్తూ, వారి విశ్వాసాలకు ఒక శాశ్వత వేదిక కల్పించే దిశగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇది కేవలం ఓ భవన నిర్మాణం కాదు.. భక్తి భావానికి కల్పించిన గౌరవం.. ఇచ్చిన మాటకు నిలబెట్టిన విలువ అంటూ పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ సన్నిధానం వేదికగా నిలవనుంది. భక్తులంతా ఒకచోట చేరి స్వామివారి సేవలో పాల్గొనేందుకు సౌకర్యం కలగనుంది.ఎన్నికల సమయంలో పలికిన మాటను ఆచరణలో చూపిన సర్పంచ్ చొరవపై సన్నిధాన స్వాములు, గ్రామ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి, వాటికి కార్యరూపం కల్పించే ఇలాంటి కార్యక్రమాలు గ్రామ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి దోహదపడతాయని పేర్కొంటున్నారు.





మంథనిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల్లో నిర్లక్ష్యం

- పది రోజులకే బీటలు వారుతున్న రోడ్లు
- అసంపూర్తిగా సైడ్ డ్రైనేజీలు
- మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేసిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఏదీ?
- కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రజా వాయిస్ మంథని ప్రజలకు మెరుగైన రహదారి, మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేసిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంథని మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు పోచమ్మవాడ డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంలో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కనిపిస్తోందని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్ ఆరోపించారు. ఈ ప్రాంతంలో నిర్మించిన సీసీ రోడ్లు వేసిన కొద్ది రోజులకే బీటలు వారుతున్నాయని, రోడ్డు నిర్మాణంలో అవసరమైన గ్రావెల్‌ను నిబంధనల ప్రకారం వేయలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో నిర్మించిన సైడ్ డ్రైనేజీలను కూడా అసంపూర్తిగా వదిలేశారని, దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల మంథనిలో రాష్ట్ర మంత్రి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణపతి సచ్చిదానంద సరస్వతి ప్రవచన కార్యక్రమం సందర్భంగా కూడా పోచమ్మవాడ ప్రాంతంలో రహదారి సమస్యలు ఎదురైనట్లు సదాశివ్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ స్వయంగా స్పందించి దగ్గరుండి పనులు చేయించిన తర్వాతే రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణ సామగ్రిని తొలగించారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యత లోపాలపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని సదాశివ్ ఆరోపించారు. ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

33 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా.!

- 15 ఏళ్లుగా సాగు.. పట్టించుకోని అధికారులు
- ఇబ్రహీంపేటలో కబ్జాదారుల ఇష్టారాజ్యం
- సర్వే చేసి హద్దులు నిర్ణయించినా ఆగని ఆక్రమణలు
- పురాతన చెరువు, కట్ట మాయం.. మట్టి విక్రయించారనే ఆరోపణలు
- బోర్లు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి ఏటా రెండు పంటలు
- కబ్జాదారుల్లో మాజీ ప్రజాప్రతినిధి, రిటైర్డ్ ఉద్యోగి ఉన్నారంటూ ప్రచారం
- కలెక్టర్ జోక్యం చేసుకుని భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

ప్రజా వాయిస్,హాలియా: ప్రభుత్వ భూమి అంటే కబ్జాదారులకు లెక్కలేదా అధికారుల సర్వేలు, హద్దుల గుర్తింపులు సైతం వారి సాగుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయా అనుముల మండలం ఇబ్రహీంపేటలో సుమారు 33 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్లు 16, 17, 68, 72లోని భూమిని కొందరు గత 15 ఏళ్లుగా ఆక్రమించి సాగు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పురాతన చెరువు, కట్టను చదును చేసి, బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని ఏటా రెండు పంటలు పండిస్తున్నారని వాపోతున్నారు. పరిస్థితి చూస్తుంటే కబ్జాదారులు 'మమ్మల్ని ఎవరేం చేయలేరు' అన్న ధీమాతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్వే చేసినా.. ఆగని ఆక్రమణలు

గత ఏడాది కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయినా ఆక్రమణలు ఆగలేదని, సర్వే మరుసటి రోజు నుంచే మళ్లీ దున్నకాలు, వరి సాగు యథావిధిగా కొనసాగించారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిగా గుర్తించినా స్వాధీనం చేసుకునే చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు.

చెరువు కట్ట మాయం..

గ్రామానికి ఉపయోగపడిన పురాతన చెరువు, కట్ట ప్రస్తుతం కనుమరుగయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కట్టను చదును చేయడంతోపాటు మట్టిని విక్రయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగినా బాధ్యులపై చర్యలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బోర్లు.. ట్రాన్స్ ఫార్మర్ .. రెండు పంటలు

ఆక్రమిత భూమిలో నాలుగైదు బోర్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు ఏర్పాటు చేసుకుని ఏటా రెండు పంటలు సాగు చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు ఈ వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు.

పలుకుబడే అండగా..?

కబ్జాదారుల్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారనే ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి. పలుకుబడి కారణంగానే అధికారులు వెనుకడుగు వేస్తున్నారా.. లేక చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారా. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేదలకు స్థలాలేవీ.. కబ్జాదారులకు 33 ఎకరాలు.?

గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు దొరకని పరిస్థితి నెలకొంటే.. మరోవైపు ప్రభుత్వ భూమి కొందరి చేతుల్లో ఉండటంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదవాడు గుంట భూమి ఆక్రమిస్తే చర్యలు తీసుకునే అధికారులు.. 33 ఎకరాల ఆక్రమణ ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్ స్పందించాలి

జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు అక్రమ నిర్మాణాలు, బోర్లు, విద్యుత్ కనెక్షన్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువు కట్ట మట్టి విక్రయంపై విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొంటుందా.. ప్రభుత్వ భూమిని కాపాడుతుందా.. అన్నది వేచి చూడాలి.





నంది వాగు శిఖం భూమిలో రిసార్ట్ నిర్మాణం?

- 30 గుంటల కొనుగోలు.. అదనంగా ఎకరం 10 గుంటల ఆక్రమణ ఆరోపణలు
- ప్రభుత్వ భూమిలో ఫామ్ హౌస్ నిర్మాణం
- అధికారుల మౌనం ఎందుకు?

ప్రజావాయిస్ / మోమిన్ పేట్:వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం కాస్లాబాద్ గ్రామ సమీపంలోని నంది వాగు ప్రాజెక్టు కుడి కాలువ పక్కన సర్వే నంబర్ 85లో భూ ఆక్రమణ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు స్థానిక రైతుల నుంచి 30 గుంటల భూమి కొనుగోలు చేసి, అదనంగా సుమారు ఎకరం 10 గుంటల ప్రాజెక్టు శిఖం భూమిని ఆక్రమించి ఫామ్‌హౌస్ నిర్మించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనికి 'ఆ జూరే 21 రిసార్ట్'గా పేరు పెట్టి పర్యాటక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

అనుమతులపై విచారణ చేపట్టాలి!

నిర్మాణాలకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? కొనుగోలు చేసిన భూమి ఎంత? ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి ఎంత? అనే అంశాలపై రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి వాస్తవాలు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఫిర్యాదులు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి, ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నంది వాగు శిఖం భూములను పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కలం ముసుగులో క్షుద్ర పూజల దందా?

- గుప్తనిధుల తవ్వకాల పేరుతో అమాయకులకు వల
- ఖని లో వెండి తాయెత్తుల కొనుగోళ్లపై చర్చ
- కోల్ బెల్ట్ లో కొందరు మీడియా ప్రతినిధుల వ్యవహారంపై ఆరోపణలు
- పోలీసుల దృష్టికి వెళ్లాయా?



ప్రజా వాయిస్ పెద్దపల్లి కలం పట్టి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన కొందరు మీడియా ప్రతినిధులపై గుప్తనిధుల తవ్వకాలు, క్షుద్ర పూజల వ్యవహారాలకు సంబంధించి ఆరోపణలు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అఘోరాలు, స్వామీజీలు, అమ్మవారి పూజలు, గుప్తనిధుల అన్వేషణ పేరుతో వ్యాపారులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన ఓ వ్యాపారి వద్ద కీలక మీడియా ప్రతినిధిగా చెప్పబడుతున్న వ్యక్తి రెండు రోజుల్లోనే సుమారు 150 వెండి తాయెత్తులు కొనుగోలు చేసినట్లు జరుగుతున్న ప్రచారం స్వర్ణకారుల వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే ఈ కొనుగోళ్ల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది స్పష్టత రావాల్సి ఉంది.

గుప్తనిధుల పేరుతో మోసాలా?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతంలో గుప్తనిధుల తవ్వకాల ప్రయత్నం జరిగినట్లు, ఆ సమయంలో కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన కొందరు మీడియా ప్రతినిధుల పేర్లు వినిపించినట్లు సమాచారం. గ్రామస్థులకు అనుమానం రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయే క్రమంలో కొందరు వెంబడించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పలువురు సింగరేణి ఉద్యోగులు, వ్యాపారులను నమ్మించి ఇలాంటి తవ్వకాల వ్యవహారాల్లోకి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పూజల పేరుతో లక్షల రూపాయల వసూళ్ల ఆరోపణలు

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందరిని, గతంలో నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను సైతం ఈ వ్యవహారాల్లోకి ఆకర్షిస్తున్నారనే ప్రచారం ఉంది. కొత్త నిర్మాణాలు, వ్యాపారాభివృద్ధి, శాంతిపూజలు, ప్రత్యేక పూజల పేరుతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల నుంచి కూడా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది పోలీసు అధికారులకు సైతం పూజలు, తాయెత్తుల పేరుతో పరిచయాలు పెంచుకుని వారి నమ్మకాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటి? ఎవరైనా అధికారులను తప్పుదారి పట్టించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

సరిహద్దు రాష్ట్రాల పరిచయాల పేరుతో ప్రయాణాలు?

కొందరు చిన్నస్థాయి మీడియా ప్రతినిధులు స్థానిక వ్యాపారులను సరిహద్దు రాష్ట్రాలకు తీసుకెళ్లి అక్కడి పూజారులతో పరిచయాలు చేయించినట్లు సమాచారం. మరోవైపు ఓ క్లబ్‌లో నాయకులుగా వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు వ్యాపారులను ఇలాంటి పూజల వ్యవహారాల్లోకి ఆకర్షిస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. ఈ ఆరోపణలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొందరు చిన్న పత్రికల జర్నలిస్టులను సైతం పూజల పేరుతో బెదిరిస్తున్నారనే ప్రచారం వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బాధితులు ఎవరైనా అధికారికంగా ఫిర్యాదు చేశారా? పోలీసులు విచారణ చేపట్టారా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత కలిగిన మీడియా రంగంలో ఎవరైనా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇలాంటి వ్యవహారాలకు పాల్పడితే అది మొత్తం జర్నలిస్టుల వృత్తి ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రచారంలో ఉన్న ఆరోపణలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



కోదాడకు అభివృద్ధి జలకళ.!

- రూ.47.64 కోట్లతో రెడ్లకుంట ఎత్తిపోతల పథకం
- ఆరు గ్రామాల్లో 4,460 ఎకరాలకు సాగునీరు
- డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజా వాయిస్, కోదాడ: కోదాడ నియోజకవర్గంలో సాగునీటి, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోదాడ మండలం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై రూ.47.64 కోట్లతో నిర్మిస్తున్న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. కాలువలు, భూగర్భ మోటార్లు, విద్యుత్తు ఉపకేంద్రం పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

4,460 ఎకరాలకు నీరు

ఈ పథకం ద్వారా ఆరు గ్రామాల్లోని 4,460 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు అందించనున్నట్లు మంత్రి వివరించారు. ద్వారకుంటలో 66, నల్లబండగూడెంలో 1,400, కాపుగల్లులో 1,608, కూచిపూడిలో 400, రెడ్లకుంటలో 576, చిమిరాలలో 410 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. నాలుగు 430 కిలోవాట్ల సామర్థ్యం గల మోటార్లతో నీటి సరఫరా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పథకంతో 1,486 కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను డిసెంబరు చివరి నాటికి నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

రూ.13 కోట్లతో భవనాలు

అనంతరం కోదాడ పట్టణంలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ నూతన భవనం, రూ.8 కోట్లతో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ శాఖ భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. షాదీఖానా నిర్మాణ పనులనూ సమీక్షించారు. ఆధునిక డిజైన్లతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని, పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో సూర్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





పంచాయతీలో డిశుం డిశుం!?

- ఇరు వర్గాల మధ్య రగులుతున్న ఆదాయపు చిచ్చు!
- ప్రజల శ్రేయస్సు కొరకు ఆలోచిస్తే అన్ని అవరోధాలే!?
- పంచాయతీ ఎన్నికల్లో మాట ఇచ్చినందుకు గ్రామం పై కన్న ప్రేమ?
- ఓటింగ్ సరే ఆధార కార్డులు మాత్రం వేరే పంచాయతీ అది ఎలా సాధ్యం!?
- వేదాంతపురం పంచాయతీ నుంచి నిధులు ఓకే మరి ఓట్లపల్లి నిధులు ఎలా సాధ్యం!?
- రెండు గ్రామాల మధ్య నిధులు వినియోగంపై జిల్లాకు చేరుతున్న పంచాయితీ!
- అసలు తిమ్మాపురం గ్రామం ఏ పంచాయతీలోకి వస్తుందో తేల్చేది ఎవరు!?
- పంచాయితీలో నిధులు స్వాహా కి పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయా!
- సోషల్ మీడియా వేదికగా సర్పంచ్ భర్త బూతు పురాణం వెనుక రహస్యం ఏమిటి?
- భార్య సర్పంచ్ భర్త పెత్తనం పై అధిష్టానం శిక్షిస్తుందా!?
- నిధులు కాజేసిన వారిని అధికారులు కాపాడతారా! లేక శిక్షిస్తారా!

ప్రజా వాయిస్ అశ్వారావుపేట ప్రత్యేక కథనంఅది ఒక గిరిజన గ్రామం గత 12 ఏళ్ల క్రితం ఏర్పడిన ఊరు అట్టి ఊర్లో గిరిజనులు రెండు పంచాయతీలకు సంబంధించి ఉండటంతో సర్పంచులు మాత్రం నిధులు వినియోగించడంలో తర్జనభర్జన పడుతున్నారు అంతేకాకుండా ఒక గ్రామానికి చెందిన సర్పంచ్ ఎన్నికల సమయంలో తమకు మద్దతు తెలపాలని అట్టి సహకరించటం వల్ల గ్రామానికి తన వంతు సహాయం చేస్తానని అది కూడా సర్పంచిగా గెలిస్తే మాట నిలబెట్టుకుంటానని చెప్పటం అటువంటి సందర్భంలో వేరే పంచాయతీ వారు నిర్మించిన మంచినీటి బావిలో గెలుపొందిన సర్పంచ్ అత్యుత్సాహం ప్రదర్శించి పంచాయతీలోని నిధులను వినియోగించి బోరు మోటారు కేబుల్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసి ఏకంగా అధిక మొత్తంలో పంచాయతీ సొమ్మును మింగేసారని ఉపసర్పంచ్ సైతం ఎంపీడీవో కి ఫిర్యాదు చేయడం తదుపరి సర్పంచ్ భర్త సోషల్ మీడియాను వేదికగా చేసుకొని అసభ్య పదజాలాలతో బూతు పురాణాలు వల్లించడం యావత్తు మండలంలో చర్చనీయాంశంగా మారింది ప్రజల శ్రేయస్సు కొరకు ఒకరు ఆలోచిస్తే మరొకరు మాత్రం ఏదోరకంగా పంచాయతీ నిధులను కాజేయాలని స్వార్థ ఆలోచనతో మరల అదే పనిమీద వారు ఆలోచించటం ప్రజలు చేసుకున్న దురదృష్టం అని చెప్పుకోవచ్చు రెండు గ్రామాల సమస్య జిల్లా అధికారులు సమస్యను పరిష్కారం చేయలేక తలలు సందర్భంలో రెండు పంచాయితీల సర్పంచులకు అదృష్టం కలిసి వచ్చిందని చెప్పుకోవచ్చు గ్రామంలోని ఆధార కార్డులు ఒక పంచాయతీలో ఉంటే ఓటు బ్యాంకు మాత్రం మరో పంచాయతీలో ఉందని దీనివల్ల పంచాయితీ నిధులు వినియోగించి తప్పుడు ఎంపీలు సృష్టించి ప్రజా సొమ్మును కాచేయాలని చూస్తున్న వారిని కొందరు అడ్డగిస్తే తనపై బురద జల్లే ప్రయత్నం చేయడమే కాకుండా సోషల్ మీడియాలో కనీసం పదాలను వాడకూడదు అంటూ లేకుండా తనకు ఇస్తానుసారంగా బూతు పురాణాలు వల్లించిన ప్పటికీ అటువంటి సర్పంచి భర్తలపై చర్యలు తీసుకునే ధైర్యవంతులు లేరని చెప్పుకోవచ్చు దీనికి కారణం అధికార పార్టీ నాయకులు ఆ సర్పంచ్ భర్తకు పుష్పలంగా అందించడమే ప్రధానంసం అటువంటి దానిని చూసుకొని ప్రజాప్రతినిధులు సైతం నోటుకి వచ్చినట్లు బూతు పురాణాలు సైతం వల్లించిన వారిపై ఎలాంటి చర్యలు ఉండవని ప్రజానీకం ప్రశ్నిస్తుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిధిలోని ఓట్లపల్లి మరియు వేదంతపురం పంచాయతీలు వేరువేరుగా కలిగి ఉన్నాయి పొట్లపల్లి పంచాయితీలోని గిరిజన కుటుంబాలు గ్రామానికి కొద్దిపాటి దూరమైన తిమ్మాపురం ప్రాంతంలో ఇల్లు నిర్మించుకొని గత 12 సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. కానీ వారి ఆధార కార్డులు మాత్రం వేదాంతపురం పంచాయతీకి అనుసంధానం చేసినవి అంటే ఈ రెండు పంచాయితీలు గతంలో ఓట్లపల్లి పంచాయతీలో ఉండటం తదుపరి కొన్ని పంచాయతీలుగా ఏర్పడటంతో ఇటువంటి సమస్య ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పెమట రెండు పంచాయితీల్లోని ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి వేదాంతపురం పంచాయతీ నుండి సుమారు 5 ఇల్లు వరకు తిమ్మాపురం గ్రామ ప్రజలకు మంజూరు చేయటం వారు వాటిని వినియోగించుకోవడం అందరికీ తెలిసిన విషయమే! ఇకపోతే ఓట్లపల్లి సర్పంచిగా



పోటీ చేసిన ఓ మహిళ భర్త తమ భార్యను సర్పంచిగా గెలిపిస్తే ఓట్లపల్లి పంచాయితీ నుండి కొంత నిధులను తిమ్మాపురం గ్రామానికి వినియోగిస్తామని దానికి ఓటు బ్యాంకు కలిగిన ప్రతి ఒక్కరు సహకరించాలని గెలిచిన కొద్ది రోజుల్లోనే పంచాయితీ నిధుల నుండి ప్రజలకు ఏదో ఒక సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడం దానికి వారు సరైన జవాబు చెప్పటం పంచాయితీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సర్పంచ్ భర్త కె ఓటు వేయడం గెలవటం అధికార పార్టీ అయినా కాంగ్రెస్ పార్టీ ఓట్ల పెళ్లి పంచాయితీ కైవాసం చేసుకోవడం వంటి సంఘటనలు తెలిసినవి ఇటువంటి సందర్భంలో హామీలు ఇచ్చిన సర్పంచ్ భర్త చొరవతో తిమ్మాపురం గ్రామంలో నీటి సమస్య ఎద్దడి కోసం బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఓ మాజీ సర్పంచ్ వేదాంతపురం నుండి బోరు బావి నిర్మించి వదిలేయడంతో ఉట్లపల్లి సర్పంచ్ భర్త చొరవ చూపి సుమారు లక్ష 17 వేల రూపాయలతో విద్యుత్ మోటార్ 7.5. మరియు విద్యుత్ కేబుల్ ను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తీర్చానని చెప్పుకోవటంతో అది గ్రహించిన ఉపసర్పంచ్ వేరే పంచాయితీ నిధులు ద్వారా తిమ్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బోరుబావికి ఓట్లపల్లి పంచాయతీ నిధులు ఎట్లా వినియోగిస్తారొ అంతేకాకుండా కేవలం 70,000 నుండి 80 వేల రూపాయలు మేరకే అయ్యే వ్యాయామం 17వేల రూపాయలు ఎట్లా అవుతాయో వివరించాలంటూ ఉపసర్పంచ్ ఎంపీడీవో కి ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ భర్త సోషల్ మీడియాను వేదికగా చేసుకొని బూతు పురాణం వల్లిస్తూ ఇది నా అడ్డ! నేను ఎవరికీ భయపడేది లేదు? ఎవరికి సమాధానం చెప్పేది లేదు? ఎవడు ఆపుతాడో నేను చూస్తా! నేను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధిని. అంతేకాకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యుని ఏ అధికారి కూడా నాకు సలాం చేయాల్సిందే! అంటూ ధీమా వ్యక్తం చేయటం గ్రామంలో సంచలన సృష్టిస్తుంది.

మురుసు తుఫాన్ వల్ల రోడ్డు నిర్మాణంలో రగడ!?



ఈనెల నాలుగో తారీఖు తెలంగాణ రాష్ట్రంలోని కొంత భాగాన్ని మురుసు తుఫాన్ ఉక్కిరిబిక్కిరి చేసిన సంఘటన అందరికీ తెలిసిన విషయమే! ఇటువంటి సందర్భంలో రైతు కంట కన్నీళ్లతో పాటు అనేక భవనాలు రోడ్లు పహరి గోడలు ఇల్లు చెట్లు వంటివి నేలమట్టం చేయడం చూసిందే! ఓట్లపల్లి పంచాయతీ పరిధిలోని పాపిడి గూడెం గ్రామానికి వెళ్లే రహదారి రోడ్డు నిర్మాణంలో ఉపసర్పంచ్ ప్రజల శ్రేయస్సు కోసం రోడ్డు నిర్మాణం సిరి వేగంగా పనులు నిర్మిస్తే వాటిని ప్రభుత్వ అధికారి తిరస్కరించటంతో వెనివెంటనే మరల సర్పంచి భర్త తన అత్యుత్సాహం ప్రదర్శించి మరల యంత్రాలతో రోడ్డు నిర్మాణాన్ని పునర్దన చేయటం ఇరు వర్గాల విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు 15 లక్షల రూపాయలు నిధులు విడుదలటా!?

నిజానికి పంచాయతీ చిన్నదే అయినప్పటికీ ఎన్నికలు జరిగి కొద్దిపాటి కాలం అవటంతో నేటికి సుమారు 15 లక్షల మేరకు వివిధ రకాల పనులకు సంబంధించిన నిధులను విడుదల చేసినట్లు విశ్వసనీయ సమాచారం ఇటువంటి నిధుల్లో ఎక్కువ భాగం సర్పంచ్ భర్త చేతివాటమే ఎక్కువగా ఉందని అంతేకకుండా కాంట్రాక్ట్ అవతారం కూడా ఎత్తి కొన్ని పనులు చేసుకొని సర్పంచ్ హోదా వచ్చిన పెమట వాటిని డ్రా చేసుకొని ప్రజల సొమ్మును కాజేసినట్లు గ్రామాలలో ప్రచారం జోరుగా కొనసాగుతుంది.

ఉప సర్పంచ్ పనుల్లో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో వీడియోలు ప్రచారాలు?

గ్రామంలోని పంచాయతీ భవనం పల్లె ప్రకృతి వనం కలవట్లు నిర్మాణాలు వంటి పనులలో భారీగా ఉపసర్పంచ్ అక్రమాలు జరిగాయని అంతేకాకుండా తమ పనులకు ఆటంకం కలిగాయని విష పూరిత వ్యూహరచనలు చేస్తున్నాడని మండల స్థాయి అధికారులకు సర్పంచ్ భర్త ఫిర్యాదు చేయటం సభ్యము కాదని అక్రమాలు పాల్పడితే వెంటనే విచారణకు సహకరిస్తానని ఉప సర్పంచ్ సవాలు విసురుతున్న సర్పంచ్ భర్త సేకరించే పరిస్థితి కనిపించడం లేదని ఇరువురు మధ్య రగడ తారాస్థాయికి చేరుకోవటం కొసమెరుపు.

సోషల్ మీడియాలో బూతు పురాణం వల్లించిన సర్పంచ్ భర్త!

రాష్ట్రంలో మీడియా ప్రధాన పాత్ర వహిస్తుంది ఎక్కడ అక్రమ నిధులు దుర్వినియోగమైన అవినీతి జరిగిన అక్రమాలకు పాల్పడిన వెంటనే పలు కథనాలు పలు రకాల వీడియోలు దిన పత్రిక కథనాలతో ప్రచురించటం సర్వసాధారణమైంది ఇటువంటి వాటిని ప్రజాప్రతినిధులు గౌరవించకపోగా ప్రజలు ప్రచురించిన ప్రతినిధిని సోషల్ మీడియాలో బూతు పురాణాలు వల్లించడం ఒక ఫ్యాషన్ కింద తయారైందని దీనికి ప్రధాన కారణం అధికార పార్టీ అండదండలతో కొందరు ప్రజాప్రతినిధులు ఇటువంటి దారుణానికి పాల్పడుతున్నారని నిజానికి రాష్ట్రంలో పత్రికలు ప్రధాన పాత్ర వహిస్తున్న వాటిని కించపరిచే విధంగా రాజకీయ నాయకులు నడుచుకోవడం దురదృష్టకరంగా ఉందని ఓట్లపల్లి సర్పంచ్ సోషల్ మీడియాలో బూతులు పురాణం ఒక దినపత్రిక(ప్రజా వాయిస్ కాదు) ను మరియు మీడియా ప్రతినిధిని సైతం తన అహంకారాన్ని చూపుతూ అసభ్య పదజాలంతో మాట్లాడిన విధానం సోషల్ మీడియాలో చక్కెరల కొట్టడంతో ఆ నోట ఈ నోట భారీగా చర్చినియాంశంగా మారింది.

అధికార పార్టీ అండతో అహంకారం ప్రదర్శిస్తున్న నాయకులు

ఓట్లపల్లి పంచాయితీ అధికార పార్టీ కాంగ్రెస్ సర్పంచ్ కావడం తనిఖీ అన్ని రకాలుగా సహకారాలు అందించడం వంటి అహంకారంతోనే సోషల్ మీడియా వేదికగా బూతు పురాణాలతో పాటు అనేక రకాలుగా వ్యక్తులను కించపరిచే విధంగా నడుచుకోవడం వారికి అండదండలు కాంగ్రెస్ ప్రభుత్వమే అంటూ కొందరు సీనియర్ సిటిజన్లు సైతం ఆగ్రహిస్తున్న ఘటనలు అశ్వారావుపేట నియోజకవర్గంలో సంచలన సృష్టిస్తున్నాయి ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఓట్లపల్లి పంచాయితీలో జరిగిన అక్రమాలపై స్పెషల్ అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సైతం దృష్టి సారించాలని వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపితే ఇంటి దొంగలు దొరికే అవకాశం ఉంటుందని గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

మూడేళ్లుగా సాగిన వసూళ్ల పర్వం.. మొత్తం ఎంత?



- అధికారుల ఆదేశాలు లేకుండా లారీకి రూ.500 వసూలు చేశారా?
- కుందనపల్లి ఎన్టీపీసీ బూడిద రవాణాలో అక్రమ వసూళ్ల ఆరోపణలు
- మూడేళ్లలో ఎంత మొత్తం వసూలు చేశారు?
- ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలేవీ?
- కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ సమాధానం చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజా వాయిస్ గోదావరిఖని కుందనపల్లి ఎన్టీపీసీ బూడిద రవాణా లారీల నుంచి గత మూడేళ్లుగా ఒక్కో ట్రిప్పునకు రూ.500 చొప్పున వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా, జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండానే లారీల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ మూడేళ్లలో మొత్తం ఎంత సొమ్ము వసూలు చేశారు? ఆ డబ్బు ఎవరికి చేరింది? అనే ప్రశ్నలను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ లేవనెత్తారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లిలోని ఎన్టీపీసీ బూడిద చెరువు నుంచి అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు లారీల ద్వారా బూడిదను రవాణా చేస్తున్నారు. అయితే ఈ రవాణా మార్గంలో కంటైనర్ ఏర్పాటు చేసి, స్థానిక రెవెన్యూ సిబ్బంది పేరుతో ఒక్కో లారీ ట్రిప్పునకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ప్రస్తుతం వసూళ్ల కంటైనర్‌ను తాత్కాలికంగా తొలగించినట్లు చర్చ జరుగుతోంది. ఒక్కో లారీకి రూ.500 చొప్పున వసూలు చేస్తూ మూడేళ్లపాటు ఈ వ్యవహారం కొనసాగితే ఇప్పటివరకు ఎంత మొత్తం చేతులు మారి ఉంటుందనే అంశంపై చందర్ ప్రశ్నలు సంధించారు. రోజుకు ఎన్ని లారీలు రాకపోకలు సాగించాయి? మొత్తం ఎన్ని ట్రిప్పులు జరిగాయి? మూడు సంవత్సరాల్లో ఎంత డబ్బు వసూలైంది? ఈ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది? అనే వివరాలను అధికార యంత్రాంగం బయటపెట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాకుండా లారీ రవాణాపై డబ్బులు వసూలు చేసే అధికారం ఎవరిచ్చారు? ప్రభుత్వ అనుమతి లేకుండా మూడేళ్లుగా ఈ వసూళ్లు జరిగితే సంబంధిత అధికారులు ఇంతకాలం ఏం చేస్తున్నట్లు? ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని గుర్తించి ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి

కలెక్టర్, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ స్పందించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా వసూళ్లు జరిగాయా? జరిగితే అందుకు బాధ్యులెవరు? మూడేళ్లలో ఎంత మొత్తం వసూలు చేశారు? ఆ సొమ్ము ఎవరికి చేరింది? అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సీబీఐ, డీఓపీటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ కోరుతానని చందర్ స్పష్టం చేశారు. కంటైనర్ తొలగింపుతో ఈ వ్యవహారాన్ని మరుగున పడనీయకుండా, మూడేళ్ల వసూళ్ల పూర్తి లెక్కలు ప్రజల ముందుంచి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.





65వ జాతీయ రహదారి పొడువున ఉన్న అక్రమ వెంచర్లు

- మామిడిపల్లి నుంచి జహీరాబాద్ వరకు వందల సంఖ్యలో వెంచర్లు...
- అనుమతులు 10 శాతం మాత్రమే
- మామూళ్ల మత్తులో జిల్లా పంచాయతీ అధికారులు
- ఎల్ పి నెంబరు పెట్టుకొని ప్లాట్ల ఏర్పాటు... శ్వాసిత నిర్మాణాలు
- ల్యాండ్ కన్వెన్షన్ కాకుండా వెంచర్లు

ప్రజా వాయిస్ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని 65వ జాతీయ రహదారి పొడవున సుమారు 60 కిలోమీటర్లు ప్రధాన రహదారికి ఇరువైపులా ఇష్టానుసారంగా ఎల్పీ నెంబర్ల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వెంచర్లు ఏర్పాటు చేసి ఆకర్షించే విధంగా బోర్డులను పెట్టి అమాయకులను బోల్తా కొట్టిస్తున్నారు. తీరా ప్లాట్ రిజిస్ట్రేషన్ కి వచ్చే సమయానికి ల్యాండ్ కన్వెన్షన్ కూడా కాకముందు ప్లాట్లు ఎలా కొనుగోలు చేశారంటూ అధికారులు ప్రశ్నిస్తే కానీ వెంచర్ల వ్యవహారం బయటపడడం లేదు. కంది మండలంలోని పలు గ్రామాలలో సైతం ఈ అక్రమ వ్యవహారం కొనసాగుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వస్తుంది.. దీంతో వెంచర్లు హెచ్ఎండీఏ పరిధిలోనే అనుమతులు ఇవ్వాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్లు మాత్రం సంగారెడ్డి, పటాన్చెరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అధికారుల అండదండలతో బ్రోకర్లను పట్టుకొని గుట్టు చప్పుడు కాకుండా భూమి కొనుగోలు రిజిస్ట్రేషన్ దాక్యుమెంట్లను బట్టి ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. దీని ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో నష్టం జరుగుతుందన్న విషయం అధికారులకు తెలిసిన తమకు ఎంతో కొంత ఇస్తున్నారు కదా అని మామూలు దండుకొని అర్హత లేకపోయినా ప్లాట్లుగా విభజించి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు . సతస్ పేట పట్టణం, మండల పరిధిలోనీ శివారులో అయితే వెంచర్ల సంగతి చెప్పనక్కర్లేదు. ఫామ్ లాండ్ల పేరుతో అభివృద్ధి చేస్తామంటూ ముందస్తు అనుమతులు తీసుకొని ఏకంగా ఆర్చీలు నిర్మాణం చేయడం, ప్లాట్లుగా విభజించడం, రోడ్లు సైతం నిర్మాణం చేసి అమ్మకాలు జరుపుకుంటున్నారు. ఇదే మండలంలోని ఆరూర్ శివారులో అసలు ఏ సమస్త వెంచర్ వేస్తుందో కూడా బోర్డు లేని పరిస్థితి. కానీ సదస్సు పేట మండలం జిల్లా పంచాయతీ అధికారి పరిధిలోకి వస్తుంది. ఇలాంటి అక్రమ నిర్మాణాలు చేస్తున్న స్థానిక తహసిల్దార్ మాత్రం అటువైపు చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆరు శివారులోని జిహెచ్ ఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్ పేరుతో ఎల్ పి నెంబర్ లేకుండానే రోడ్లు వేయడం చూస్తే జిల్లా అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో పాటే దానికి ఆనుకుని ఉన్న లక్ష్మంప్రియ డెవలపర్స్ అనే సంస్థ సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ను ఏర్పాటు చేసి తాత్కాలికంగా ఆర్చి నిర్మాణం చేశారు. ఎల్ పి నెంబర్ రాగానే ఇలాంటివి పనులు చేయడం చట్ట విరుద్ధం. కానీ ఫైనల్ ఎల్పీ నెంబర్ రాకముందే అడ్డగోలుగా నిర్మాణాలు చేయడం ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది.

ఎల్పీ నెంబర్ అడ్డం పెట్టుకొని...

ప్రభుత్వ నిబంధన ప్రకారం ది అడ్జస్ట్ వ్యాపారం చేయాలనుకుంటే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు... ఎన్ని ప్లాట్లు... రోడ్లతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణంకు కేటాయించిన స్థలం, పార్కుకు ఎంత కేటాయించారు... తాగునీటి అవసరాల కోసం ట్యాంక్ నిర్మాణం కు స్థలం కేటాయించి ముందుగా వెంచి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే ఎల్.పి నెంబర్ ఇస్తారు. పైన పేర్కొన్న పార్టీ అన్నిటిని కేటాయించి జిల్లా పంచాయతీ అధికారి వెంచర్ను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గనుక ప్లాట్లు పార్కు స్థలం తదితర వాటిని పరిశీలించి పూర్తి స్థాయిలో గనుక ప్రభుత్వపరంగా కేటాయించి వెంచర్ను ఏర్పాటు చేసినట్లయితే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకొని ఫైనల్ ఎల్పీ నెంబర్ ఇస్తారు. ఈ నెంబర్ వచ్చాకే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ వెంచర్లను ప్లాట్లను విక్రయించడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. కానీ కొందరు రియల్ లిస్ట్ వ్యాపారులు అధికారులకు మామూళ్లు ఇస్తే చాలు రిజిస్ట్రేషన్ చేస్తారు అన్న ధీమాతో కొందరు నేరుగా ప్లాట్ల విక్రయాల్లో కొనసాగిస్తున్నారు. ఎందుకు రెవెన్యూ అధికారులకు ఏమి తక్కువ చేయమన్న పరిస్థితిలో వెంచర్ యజమానులు 10% కమిషన్ రూపంలో రెవెన్యూ అధికారులకు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి లక్షల రూపాయలు మామూలు రూపంలో అధికారులకు అందుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సంగారెడ్డి పటాన్చెరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అయితే మినిమం 10 లక్షలు లేకుండా ఏ ఒక్క అధికారి ఇంటికి వెళ్లడం లేదు అనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిపై విచారణ చేపట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డ్వాక్రా భవనానికి దిక్కేది.?

- 500 మంది మహిళలకు ఎదురుచూపులే
- ప్రభుత్వ స్థలం కబ్జాదారుల చెరలో
- రూ.15 లక్షలతో మంజూరైన భవనానికి రెండేళ్లయినా స్థలం కరువు
- 4 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం
- 15 చోట్ల ఇళ్లు, 8 చోట్ల బెల్ట్ షాపులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- 17న తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నాకు హెచ్చరిక



ప్రజా వాయిస్, కొమరం భీం ఆసిఫాబాద్/ చింతలమానెపల్లి: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం డ్వాక్రా మహిళలకు కనీసం సమావేశం నిర్వహించుకునేందుకు భవనం కూడా అందుబాటులో లేకుండా పోయింది. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో 500 మంది డ్వాక్రా మహిళల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం రెండేళ్ల క్రితమే రూ.15 లక్షలతో విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనాన్ని మంజూరు చేసినా.. నిర్మాణానికి అవసరమైన ఐదు గుంటల స్థలం మాత్రం ఇప్పటికీ దొరకడం లేదు. మరోవైపు గ్రామంలోని సర్వే నంబర్లు 45, 67, 112లో ఉన్న 4 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కబ్జాలకు అడ్డూ అదుపు లేదా.?

గ్రామంలో 32 స్వయం సహాయక సంఘాలకు చెందిన సుమారు 500 మంది మహిళలు ఉన్నారు. వీరి సమావేశాల కోసం ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ రికార్డుల్లో భూమి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ భూమిలో సుమారు 15 చోట్ల పక్కా ఇళ్లు, మరో 8 చోట్ల బెల్ట్ దుకాణాలు వెలిశాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఆక్రమణల వెనుక కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎండలోనే మహిళల సమావేశాలు.!

భవనం లేకపోవడంతో డ్వాక్రా మహిళలు చెట్ల కింద, అంగన్‌వాడీ కేంద్రం ముందు సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. బ్యాంకు లింకేజీ, పొదుపు లెక్కలు, రుణాలు, పిల్లల భవిష్యత్తుపై చర్చించుకోవడానికి సరైన వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. బెల్ట్ దుకాణాలకు ప్రభుత్వ స్థలంలో చోటు దొరుకుతుందగా.. మహిళల సమావేశ భవనానికి మాత్రం స్థలం ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా స్పందనేది.?

ఈ సమస్యపై గత ఆరు నెలల్లో తహశీల్దార్‌కు నాలుగుసార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ డోంగ్రె సంతోష్ తెలిపారు. ఆసిఫాబాద్ ఆర్డీవోకు రెండుసార్లు వినతిపత్రాలు అందించడంతో పాటు ఇరిగేషన్ డీఈని కూడా కలిసి సమస్య వివరించినట్లు చెప్పారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణదారుల ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారని ఆరోపించారు.

17న నిరవధిక ధర్నాకు హెచ్చరిక

ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను తొలగించి డ్వాక్రా భవన నిర్మాణానికి ఐదు గుంటల స్థలం కేటాయించాలని మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీ డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెల 17వ తేదీ సోమవారం చింతలమానెపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించాయి. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి 500 మంది మహిళలకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బెల్ట్ షాపులకు స్థలం ఉంది.. మాకు లేదా.?

మేము 32 సంఘాలకు చెందిన 500 మంది మహిళలం. నెలకు రెండుసార్లు సమావేశాలు నిర్వహించుకోవాలి. కానీ కూర్చోవడానికి గది కూడా లేదు. ఎండలో చెట్ల కింద సమావేశాలు పెట్టుకుంటున్నాం. ప్రభుత్వ స్థలంలో బెల్ట్ షాపులు నడుస్తుంటే.. మహిళా సాధికారత భవనానికి స్థలం ఎందుకు కేటాయించడం లేదు? వెంటనే స్థలం చూపించి భవన నిర్మాణం చేపట్టాలి.

–జ్యోతి, వీఓ అధ్యక్షురాలు, డబ్బా

ఏడు రోజుల్లో స్థలం కేటాయించాలి

గత ఆరు నెలల్లో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదు. ఏడు రోజుల్లో భవనానికి స్థలం కేటాయించకపోతే 500 మంది మహిళలు, గ్రామ యువతతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం. దీనికి అధికారులే బాధ్యత వహించాలి.

–డోంగ్రె సంతోష్, సర్పంచ్, డబ్బా గ్రామం

ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- రూ.57.85 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు
- త్వరలో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన
- స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజా వాయిస్, /ఆదిలాబాద్ ఆదిలాబాద్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.58.85 కోట్లతో నిర్మించిన నూతన ఐటీ టవర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిధుల కొరతతో నిలిచిపోయిన ఐటీ టవర్ నిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా ఐటీ సంస్థలను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.ఐటీ టవర్‌లో టాస్క్ శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్టీటీ డేటాలో 300 మంది, ఎన్ ల్యాబ్స్‌లో 250 మంది, వైడర్ సాఫ్ట్‌వేర్‌లో 20 సీట్లు, పోస్టిట్ ఏఐలో 50 మందికి ఉపాధి కల్పించేలా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని వెల్లడించారు. స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌లో 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. తొలివిడతలో 2 వేల ఎకరాలు, రెండో విడతలో మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, భూసేకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి త్వరలో శంకుస్థాపన చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాంకేతిక, విధానపరమైన సమస్యలను పరిష్కరించి పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ, ఐటీ టవర్ ప్రారంభం జిల్లా యువత భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే, సీసీఐ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఐటీ టవర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి, ఐటీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగావకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో మరో ఐటీ టవర్ మంజూరు చేయాలని కోరారు. స్థానిక పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఐటీ, పారిశ్రామిక సంస్థల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని, ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సెక్రటరీ లు అనుదీప్, శశాంక్, అదనపు కలెక్టర్లు ఎస్. రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, ఐటీ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో కానిస్టేబుల్‌కు జైలు

- ఆరు నెలల శిక్ష.. రూ.2 వేల జరిమానా
- తొమ్మిదేళ్ల తర్వాత కోదాడ కోర్టు తీర్పు



ప్రజా వాయిస్,కోదాడ: కొట్లాట కేసులో పోలీస్ కానిస్టేబుల్ కీత సురేష్‌కు కోదాడ ప్రథమ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మహమ్మద్ ఉమర్ ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించారు. అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన క్రైమ్ నంబర్ 18/2017 కేసులో బుధవారం ఈ తీర్పు వెలువడింది.నీసీ నంబర్ 1960/2017లో విచారణ జరిపిన న్యాయస్థానం ఏ-1 నిందితుడైన కీత సురేష్‌ను ఐపీసీ సెక్షన్లు 448, 323, 506 కింద దోషిగా నిర్ధారించింది. సెక్షన్ 448 కింద ఆరు నెలల జైలు, రూ.500 జరిమానా, సెక్షన్ 323 కింద ఆరు నెలల జైలు, రూ.500 జరిమానా, సెక్షన్ 506 కింద ఆరు నెలల జైలు, రూ.1,000 జరిమానా విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా పని చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కళ్యాణి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పి. ఏడుకొండలు, అనంతగిరి ఎస్సై ఏడుకొండలును న్యాయమూర్తి అభినందించారు.

గురుకులంలో విద్యార్థుల మధ్య ఘర్షణ.!

- ముగ్గురు మైనర్లపై విచక్షణారహితంగా దాడి
- నేలపై కూర్చోబెట్టి పిడిగుద్దులతో చితకబాదిన తోటి విద్యార్థులు
- నల్గొండ జిల్లా పెద్దవూర గురుకులంలో కలకలం
- దాడి ఘటనకు సంబంధించిన వీడియో వైరల్
- సెక్యూరిటీ లేక.. సిబ్బంది పర్యవేక్షణ కరువు
- విద్యార్థుల భద్రతపై ఉన్నతాధికారుల నిర్లక్ష్యమా

ప్రజా వాయిస్, పెద్దవూర.నల్గొండ జిల్లాలోని పెద్దవూర గురుకుల పాఠశాలలో విద్యార్థులపై దాడి ఘటన కలకలం రేపుతోంది. ముగ్గురు మైనర్ విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి పలువురు యువకులు విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వెలుగులోకి రావడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.విద్యార్థులపై దాడి జరుగుతున్న సమయంలో పర్యవేక్షణ చేసే సిబ్బంది, భద్రతా సిబ్బంది ఎక్కడున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గురుకుల ప్రాంగణంలో విద్యార్థుల భద్రతకు తగిన ఏర్పాట్లు ఉన్నాయా అసలు ఈ ఘర్షణకు కారణాలేమిటి దాడికి పాల్పడిన వారెవరు అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యా రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడు ఆజాద్...

- దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన సేవలు చిరస్మరణీయం
- జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- ఆజాద్ ఆశయాలను భావితరాలకు అందించాలని పిలుపు

ప్రజా వాయిస్ పెద్దపల్లి

భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బుధవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించిన ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప పండితుడిగా, బహుభాషా కోవిదుడిగా దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సుమారు 11 సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించి విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఐఐటీ, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి విద్యా, సాంస్కృతిక సంస్థల అభివృద్ధికి ఆయన అందించిన మార్గదర్శకత్వం ఎంతో కీలకమని వివరించారు. 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించాలని, మహిళా అక్షరాస్యతతో పాటు సాంకేతిక విద్యను ప్రోత్సహించాలని ఆజాద్ ఆకాంక్షించారని గుర్తుచేశారు. ఆయన సేవలను



స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో సెమినార్లు, వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆజాద్ ఆశయాలను భావితరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్య సమాజ,దేశ ప్రగతికి పునాది

- ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా అదనపు కలెక్టర్ పాండు
- ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

ప్రజా వాయిస్,సంగారెడ్డి :

భారతదేశ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలందించారని తెలిపారు. దేశంలో ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, యూజీసీ ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి బలమైన పునాదులు వేశారని వివరించారు. చదువుతోనే ప్రపంచాన్ని మార్చగలమని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వసించారని గుర్తుచేశారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి కూడా పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చలపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు,మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వ్యవహారంలో దాసరి శివపై కాంగ్రెస్ వేటు..

- రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ
- పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నట్లు మండల అధ్యక్షుడు ప్రకటన
- మంత్రి శ్రీధర్‌బాబు పర్యటనకు వచ్చిన ఎంపీ గడ్డం వంశీకృష్ణను కలిసిన వ్యవహారమే కారణమా?
-రాజకీయ వర్గాల్లో చర్చ

ప్రజా వాయిస్ రామగిరి


పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను రామగిరి ఖిల్లా పర్యటన సందర్భంగా కలిసిన నేపథ్యంలో చర్చకు వచ్చిన దాసరి శివ సస్పెన్షన్ వ్యవహారంలో అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దాసరి శివను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి తులసిరాం గౌడ్ పేరుతో నవంబర్ 11న ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ లెటర్‌హెడ్‌పై జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా దాసరి శివపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను ఎవరైనా ఉల్లంఘిస్తే సస్పెన్షన్‌తో పాటు బహిష్కరణకు కూడా గురయ్యే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో వెల్లడించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఈ చర్య తీసుకున్నట్లు మండల అధ్యక్షుడు పేర్కొన్నారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేను..

తనపై సస్పెన్షన్ చర్య నేపథ్యంలో దాసరి శివ స్పందిస్తూ.. తాను ఎవరికీ బానిసను కాదని, తనకు ఎవరూ జీతాలు ఇవ్వడం లేదని, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

ఎంపీని కలవడమే అసలు కారణమా?

రామగిరి ఖిల్లా పర్యటనకు వచ్చిన ఎంపీ గడ్డం వంశీకృష్ణను దాసరి శివ కలవడం అనంతరం ఈ సస్పెన్షన్ వ్యవహారం తెరపైకి రావడం రాజకీయంగా చర్చకు దారితీసింది. అయితే ఎంపీని కలిసినందుకే సస్పెండ్ చేశారా? లేక పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన ఇతర కారణాలున్నాయా? అన్నది అధికారిక ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొనలేదు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ నుంచి వెలువడిన సస్పెన్షన్ ఉత్తర్వులు రామగిరి మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



తాండూర్‌కు అరుదైన గౌరవం..

- శంకర్ యాదవ్‌కు 'సేవారత్న' అంతర్జాతీయ అవార్డు!
- 15 ఏళ్లుగా సామాజిక సేవలకు గుర్తింపు..
నవంబర్ 15న న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక పురస్కారం ప్రదానం

ప్రజావాయిస్ / తాండూర్:



తాండూర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త, 'శ్రీ సాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్' అధినేత బి. శంకర్ యాదవ్ ప్రతిష్ఠాత్మక 'సేవారత్న అంతర్జాతీయ అవార్డు'కు ఎంపికయ్యారు. గత 15 సంవత్సరాలుగా ఆయన నిర్వహిస్తున్న వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, సమాజం పట్ల చూపుతున్న నిబద్ధతను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది.దేశవ్యాప్తంగా సామాజిక, సాహిత్య, విద్యా, సేవా, వ్యాపార రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను బహుజన సాహిత్య అకాడమీ ఏటా గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్కరిస్తోంది.ఈ క్రమంలో తాండూర్ ప్రాంతం నుంచి శంకర్ యాదవ్ ఎంపిక కావడం విశేషంగా నిలిచింది.

నవంబర్ 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం

నవంబర్ 15, 2026న న్యూఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో నిర్వహించనున్న 'బహుజన రైటర్స్ 20వ జాతీయ సదస్సు'లో శంకర్ యాదవ్‌కు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ప్రత్యేక ఆహ్వానిత అతిథిగా కూడా హాజరుకానున్నారు.శంకర్ యాదవ్ అంతర్జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడంతో తాండూర్‌కు చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, శ్రేయోభిలాషులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం

నేటి యువతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం
జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్

ప్రజా వాయిస్,మహబూబాబాద్

విద్యా వైతాళికుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అన్నారు.జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ హాజరై, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1923లో కేవలం 35 సంవత్సరాల వయసులోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అతి పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ తొలి విద్యా శాఖ



మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి, విద్యా సంస్కరణలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఆధునిక విద్యా విధానాలు, విద్యా ప్రణాళికల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అప్పటివరకు అమలులో ఉన్న విద్యా విధానాల్లో మార్పులు తీసుకువచ్చి, దేశ అవసరాలకు అనుగుణంగా నూతన విద్యా విధానానికి పునాదులు వేశారని వెల్లడించారు.దేశంలో వైద్య కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఐఐటీలు, మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన విశేషంగా కృషి చేశారని వివరించారు. అనేక భాషల్లో ప్రావీణ్యం కలిగిన ఆయన విద్యారంగంలోనే కాకుండా దేశాభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు.ఎంతో ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ ఎలాంటి స్వార్థం లేకుండా దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి, భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని తెలిపారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు, దేశభక్తి, విద్యారంగానికి ఆయన చేసిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం మైనారిటీ ప్రతినిధులు, జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ, జిల్లా రెవెన్యు అధికారి నాగలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, అప్పారావు, దామోదర్, శ్రీనివాస్ యాదవ్, ఏం ఏ ఫిరోజ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు



సూర్యాపేట మున్సిపాలిటీలో ఖాళీ కుర్చీల రాజ్యం!

ఆరు నెలలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక అస్తవ్యస్తంగా పారిశుధ్యం
చెత్త కుప్పలతో దుర్గంధం..దోమలు, ఈగలతో ప్రజలకు రోగాల భయం



ప్రజా వాయిస్,సూర్యాపేట:

సూర్యాపేట మున్సిపాలిటీలో పాలన గాడి తప్పిందా? పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు గత ఆరు నెలలుగా ఖాళీగా ఉండటంతో పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పరిస్థితులు దారుణంగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వీధులు, డ్రైనేజీల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతూ దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!

పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా రావడం లేదని, పారిశుధ్య సిబ్బంది విధుల



నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.దీంతో రోడ్ల పక్కన, నివాస ప్రాంతాల్లో చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వ్యాపిస్తోంది.

దోమలు, ఈగలతో రోగాల భయం

చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయని, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో పాటు సీజనల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు చెత్త కారణంగా డ్రైనేజీలు మూసుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, దీంతో నడవడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

ఫిర్యాదులు వినేవారేరీ?

వార్డుల్లో సమస్యలు తలెత్తినప్పుడు అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా ప్రజలకు సరైన వేదిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లినా సంబంధిత అధికారి అందుబాటులో లేరనే సమాధానాలు వస్తున్నాయని, సమస్యలను పరిష్కరించేవారు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ స్పందించాలి.. ఖాళీ పోస్టు భర్తీ చేయాలి

మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి వార్డులో నిత్యం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించకపోతే ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- తాండూర్ నుంచి శబరిమలకు అద్దె బస్సుల సౌకర్యం..
- తగ్గిన సూపర్ లగ్జరీ ఛార్జీలు

ప్రజావాయిస్/తాండూర్:

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం తాండూర్ ఆర్టీసీ డిపో ప్రత్యేక అద్దె బస్సులను అందుబాటులోకి తెచ్చింది. సూపర్ లగ్జరీ బస్సు అద్దెను కిలోమీటర్‌కు రూ. 65 నుంచి రూ. 59కు తగ్గించింది. 36 సీట్ల సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్సుకు రూ. 59, 55 సీట్ల ఎక్స్‌ప్రెస్‌కు రూ. 65, 40 సీట్ల డీలక్స్ బస్సుకు రూ. 57 చొప్పున ఛార్జీలు నిర్ణయించారు.అన్ని బస్సులకు గరిష్ట వెయిటింగ్ ఛార్జీ రూ. 300గా నిర్ణయించగా, టోల్ రుసుము అద్దెలోనే కలిపారు. బస్సు బుక్ చేసుకునే గురుస్వామికి ప్రయాణ ఛార్జీ మినహాయింపు ఉంటుంది. లగేజీ కోసం రెండు సీట్లు కేటాయిస్తారు. కేరళ బోర్డర్ ట్యాక్స్ మినహాయింపు ఉండగా, కర్ణాటక, తమిళనాడు బోర్డర్ ట్యాక్స్, పార్కింగ్, పర్వత ప్రాంత పన్నులు ప్రయాణికులే చెల్లించాలి. ప్రతి బస్సుకు అనుభవం ఉన్న ఇద్దరు డ్రైవర్లను కేటాయించనున్నారు.ఈ సౌకర్యాన్ని అయ్యప్ప భక్తులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు. బుకింగ్, ఇతర వివరాలకు 8309348157, 9959226251, 9440069253 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తుకు తెలంగాణ రక్షణ సేన ప్రణాళిక ఉపయోగపడుతుందా?

- రైతు సంక్షేమం నుంచి ఆధునిక టెక్నాలజీ వరకు..
కల్వకుంట్ల కవిత ప్రతిపాదనలు ఆచరణలోకి వస్తాయా?
- ప్రైవేట్ పెట్టుబడులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్లు,
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,
నాణ్యమైన విత్తనాలు, గిట్టుబాటు ధర..
- తెలంగాణ వ్యవసాయ రంగానికి
కొత్త దిశ చూపగలదా తెలంగాణ రక్షణ సేన
- సమగ్ర వ్యవసాయ విధానంతో
రైతుల జీవితాల్లో మార్పు తీసుకొస్తుందా?

మేడ్చల్ జిల్లా / ప్రజా వాయిస్ :

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగానికి ప్రత్యేక స్థానం ఉంది. కోట్లాది కుటుంబాల



జీవనాధారం వ్యవసాయం. దేశ ప్రజల ఆహార భద్రతకు రైతే పునాది. అయినప్పటికీ దేశానికి అన్నం పెట్టే రైతు నేడు అనేక ఆర్థిక, సామాజిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నాడు. పెరుగుతున్న పెట్టుబడులు, వ్యవసాయ కూలీల కొరత, నకిలీ విత్తనాలు, ఎరువుల ధరలు, పురుగుమందుల వ్యయం, మార్కెట్ అనిశ్చితి, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలు రైతు జీవితాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఒకప్పుడు గౌరవప్రదమైన వృత్తిగా భావించిన వ్యవసాయాన్ని నేడు రైతు తన పిల్లలు కొనసాగించకూడదని కోరుకునే పరిస్థితి ఎందుకు ఏర్పడింది? దేశానికి ఆహారం అందించే రైతు తన కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది? వ్యవసాయ ఆధారిత దేశంగా ప్రపంచానికి పరిచయమైన భారత్‌లో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో వ్యవసాయం సంప్రదాయ పద్ధతులపైనే ఎందుకు ఆధారపడుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ పథకాల పరిధిలో కాకుండా ఆధునిక సాంకేతికత, పరిశోధన, పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలతో కూడిన కీలక ఆర్థిక రంగంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ప్రపంచం ఆధునిక వ్యవసాయం వైపు.. మన రైతుకు టెక్నాలజీ ఎప్పుడు?

అమెరికా, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, జపాన్ వంటి దేశాలు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఉత్పాదకత, నాణ్యత, వనరుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), రోబోటిక్స్, ఆటోమేటెడ్ వ్యవసాయ యంత్రాలు, సెన్సార్ ఆధారిత నీటి నిర్వహణ, ప్రెసిషన్ ఫార్మింగ్ వంటి విధానాలు వ్యవసాయ రంగంలో కొత్త మార్పులకు దారితీస్తున్నాయి. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశంలోని సామాన్య రైతుకు అందుబాటులోకి తీసుకురావడానికి మరింత విస్తృత స్థాయిలో ఎందుకు ప్రయత్నాలు జరగడం లేదు? చిన్న, సన్నకారు రైతులు లక్షల రూపాయల విలువైన యంత్రాలను కొనుగోలు చేయలేరు. అందువల్ల గ్రామస్థాయిలో వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాలు, డ్రోన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి తక్కువ అద్దెకు అందుబాటులోకి తీసుకురావాలి. టెక్నాలజీ అనేది పెద్ద రైతులకే పరిమితమయ్యే సౌకర్యంగా కాకుండా ప్రతి రైతుకు అందుబాటులో ఉండాలి.

వ్యవసాయ రంగానికి ప్రైవేట్ పెట్టుబడులు అత్యవసరం!

వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడులతోపాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు కూడా అవసరం. వ్యవసాయాన్ని కేవలం సబ్సిడీలు, రుణమాఫీలు, సంక్షేమ పథకాలపై ఆధారపడే రంగంగా చూడకూడదు.

వ్యవసాయ యంత్రాల తయారీ, నాణ్యమైన విత్తనాల పరిశోధన, డ్రోన్ టెక్నాలజీ, కోల్డ్ స్టోరేజ్, గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు వంటి రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి.

కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ల అభివృద్ధి, ఉత్పత్తిలో ప్రభుత్వ పరిశోధనా సంస్థలు, ప్రైవేట్ ఫార్మాస్యూటికల్ కంపెనీలు, శాస్త్రవేత్తల సమన్వయం కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వ సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం కలిస్తే పెద్ద సవాళ్లను ఎదుర్కోవచ్చని ఆ అనుభవం తెలియజేసింది. అదే తరహాలో వ్యవసాయ రంగంలోనూ ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. అయితే ప్రైవేట్ పెట్టుబడుల పేరుతో రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా పారదర్శక ఒప్పందాలు, నాణ్యతా ప్రమాణాలు, ధరల రక్షణ, ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి.

వ్యవసాయ యాంత్రీకరణ.. డ్రోన్లు,ూ×తో కొత్త విప్లవం!

వ్యవసాయ రంగంలో కూలీల కొరత ప్రధాన సమస్యగా మారుతోంది. విత్తనాలు నాటడం, కలుపు తీయడం, పురుగుమందులు పిచికారీ చేయడం, పంట కోత వంటి పనులకు అవసరమైన సమయంలో కూలీలు అందుబాటులో లేకపోవడం రైతులకు భారంగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలి.

- డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, పంటల పర్యవేక్షణ.
- ూ× ద్వారా తెగుళ్లను ముందుగానే గుర్తించడం, వాతావరణ అంచనాలు, దిగుబడి విశ్లేషణ.
- ఆటోమేటిక్ సీడింగ్, రోబోటిక్ హార్వెస్టింగ్.
- సెన్సార్ల ద్వారా నేలలో తేమ, నీటి అవసరాలను గుర్తించడం.
- ఆధునిక గ్రీన్‌హౌస్, ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాలు.



- యంత్రాల ద్వారా కలుపు నివారణ, పంట కోత.

ప్రతి మండలంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి చిన్న రైతులకు రాయితీపై యంత్రాలను అద్దెకు అందించాలి.

వ్యవసాయ డ్రోన్ల నిర్వహణకు గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలి.

ఉపాధి హామీ పథకం-వ్యవసాయ అనుసంధానం అవసరమా?

వ్యవసాయ కూలీల కొరత, పెరుగుతున్న కూలి రేట్లు రైతులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేసే అంశంపై సమగ్ర విధాన చర్చ జరగాలి. చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, భూమి అభివృద్ధి, నీటి సంరక్షణ, ఫామ్ పాండ్స్ వంటి వ్యవసాయానికి ఉపయోగపడే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. రైతులకు అవసరమైన సమయంలో కూలీల లభ్యత, కూలీలకు ఉపాధి భద్రత రెండింటినీ సమతుల్యం చేసే విధానాన్ని రూపొందించాలి. ఈ విషయంలో ప్రస్తుత చట్టపరమైన నిబంధనలు, గ్రామీణ కార్మికుల హక్కులను దృష్టిలో ఉంచుకుని మార్పులను పరిశీలించాలి.

రైతు కొనుగోలు చేస్తున్న విత్తనాలు నిజంగా నాణ్యమైనవేనా?

వ్యవసాయంలో రైతు పెట్టుబడి ప్రారంభమయ్యేది విత్తనంతోనే. విత్తనం నాణ్యంగా లేకపోతే రైతు పెట్టిన పెట్టుబడి మొత్తం ప్రమాదంలో పడుతుంది. మార్కెట్లో విత్తనాలు విక్రయిస్తున్న కంపెనీలకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు ఉన్నాయా? విత్తనాల మొలక శాతం, నాణ్యత, బ్యాచ్ నంబర్, గడువు వంటి వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారా? రైతులకు కొనుగోలు బిల్లులు అందుతున్నాయా? నాణ్యత లోపం వల్ల పంట నష్టపోతే బాధ్యత ఎవరిది? అదేవిధంగా ఎరువులు, పురుగుమందుల నాణ్యతపై కూడా నిరంతర తనిఖీలు జరగాలి. ప్రతి మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువుల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయించే కంపెనీలు, డీలర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. రైతు నష్టపోయిన తర్వాత పరిహారం గురించి ఆలోచించడం కంటే, నాణ్యత నియంత్రణ ద్వారా నష్టాన్ని ముందుగానే నివారించడం ముఖ్యం.

వ్యవసాయ పరిశోధనా కేంద్రాల ఫలితాలు రైతు పొలానికి చేరుతున్నాయా?

దేశంలో ×ూూ=, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, వివిధ పరిశోధనా సంస్థలు పనిచేస్తున్నాయి. కొత్త విత్తనాలు, పంట రకాలు, తెగుళ్ల నియంత్రణ, నేల ఆరోగ్యం, నీటి నిర్వహణ, యాంత్రీకరణ వంటి అంశాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఆ పరిశోధనల ఫలితాలు సామాన్య రైతు పొలం వరకు ఎంతవరకు చేరుతున్నాయి? ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావడానికి ఎంత సమయం పడుతోంది? వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ టెక్నాలజీ కంపెనీలు, రైతుల మధ్య సమన్వయం ఎంతవరకు ఉంది? ప్రతి జిల్లాలో ఆధునిక వ్యవసాయ ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులకు శిక్షణ, నేల పరీక్షలు, పంటల ఎంపిక, తెగుళ్ల నివారణ, మార్కెట్ సమాచారాన్ని అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాకుండా రైతు పొలంలో ఫలితాలు చూపించాలి.

రైతుకు గిట్టుబాటు ధర.. ఆర్థిక భద్రత ఎప్పుడు?

రైతు పెట్టుబడులు పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు అధికమవుతున్నాయి. పంట చేతికి వచ్చిన తర్వాత సరైన ధర లభిస్తుందనే భరోసా లేదు. అధిక దిగుబడి వచ్చినా మార్కెట్ ధర పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

గిట్టుబాటు ధర అంటే కేవలం కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాదు. ఆ ధరకు సమర్థవంతమైన కొనుగోలు వ్యవస్థ, నిల్వ సదుపాయాలు, రవాణా, మార్కెట్ అనుసంధానం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతి అవకాశాలు కూడా ఉండాలి.

పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, సకాలంలో రుణాలు, కౌలు రైతులకు గుర్తింపు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రైతు పంట పండించిన తర్వాత మార్కెట్ కోసం ఎదురుచూసే పరిస్థితి కాకుండా, పంట వేయకముందే మార్కెట్ అవకాశాలు, కొనుగోలు వ్యవస్థ, ధరలపై స్పష్టమైన సమాచారం అందాలి.

తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తు.. తెలంగాణ రక్షణ సేన ఏం చేయబోతోంది?

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు. లక్షలాది కుటుంబాల జీవనాధారం. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళా రైతులు, వ్యవసాయ ఆధారిత చిన్న వ్యాపారులు, విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్, రవాణా రంగాలపై ఆధారపడిన అనేక కుటుంబాల ఆర్థిక పరిస్థితి వ్యవసాయంతో ముడిపడి ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటిస్తున్న రైతు సంక్షేమ ఆలోచనలు, వ్యవసాయ విధాన ప్రతిపాదనలు రాష్ట్ర రాజకీయ, ఆర్థిక చర్చలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. తెలంగాణ రక్షణ సేన తన ఐదు ప్రధాన సిద్ధాంతాల్లో వ్యవసాయం, అన్నదాత గౌరవానికి ప్రత్యేక స్థానం కల్పించింది. రైతుకు గౌరవం, పంటలకు గిట్టుబాటు ధర, పెట్టుబడి సహాయం, యాంత్రీకరణ, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం వంటి అంశాలను తన విధానపరమైన ఆలోచనల్లో ప్రస్తావించింది. అయితే రైతును కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుడిగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగస్వామిగా గుర్తించే దృక్పథం ఆచరణలో ఎంతవరకు కనిపిస్తుందనేది కీలక ప్రశ్న.



వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలన్న కవిత ప్రతిపాదన!

2026 జూన్ 11న నల్గొండలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమస్యల రౌండ్ టేబుల్ సమావేశంలో కల్వకుంట్ల కవిత వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించాలని ప్రతిపాదించారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పించే రాయితీలు, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రోత్సాహకాలను రైతులకు కూడా అందించాలని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యవసాయానికి మార్కెట్ కల్పించడం, పంటలకు బ్రాండ్ గుర్తింపు తీసుకురావడం, రైతులకు సకాలంలో కొనుగోలు సదుపాయాలు కల్పించడం వంటి అంశాలను ప్రస్తావించారు. జగిత్యాల మామిడిపండ్లకు బ్రాండ్ గుర్తింపు తీసుకురావడానికి తాను ఎంపీగా ఉన్న సమయంలో ప్రయత్నించినట్లు కూడా ఆమె పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలో ప్రాంతీయ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ విలువ పెంచే అంశం ముఖ్యమైనది. తెలంగాణలోని వరి, పత్తి, మిర్చి, పసుపు, మామిడి, నిమ్మ, బత్తాయి వంటి పంటలకు ప్రాంతీయ బ్రాండింగ్, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలు అభివృద్ధి చేస్తే రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు ఏర్పడతాయి. అయితే వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించడం అంటే రైతులను పారిశ్రామిక సంస్థలపై ఆధారపడేలా చేయడం కాదు. రైతుల భూమి హక్కులు, స్వేచ్ఛ, ఉత్పత్తిపై నిర్ణయాధికారం, ఆదాయ భద్రతను కాపాడుతూ వ్యవసాయానికి పరిశ్రమ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం కావాలి. నల్గొండ రైతు రౌండ్ టేబుల్ సమావేశం.. పది తీర్మానాలు ఏమిటి?.. తెలంగాణ రక్షణ సేన నిర్వహించిన నల్గొండ రైతు సమస్యల రౌండ్ టేబుల్ సమావేశంలో పది తీర్మానాలను ప్రకటించడం ఈ చర్చలో ముఖ్యమైన పరిణామం.

ఆ సమావేశంలో ప్రస్తావించిన పది ప్రధాన అంశాలు ఇవి:

- రైతు డిస్కం: రైతులకు ఇబ్బందికరంగా మారుతుందని పార్టీ అభిప్రాయపడుతున్న రైతు డిస్కం ప్రతిపాదనను వ్యతిరేకించడం.
- యూరియా యాప్: యూరియా పంపిణీలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యాప్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేయడం.
- రైతు భరోసా: పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరడం.
- కౌలు రైతులు: కౌలు రైతులకు అధికారిక గుర్తింపు కల్పించి రైతు భరోసా అందించాలని డిమాండ్ చేయడం.
- రైతు కూలీలు: రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరడం.
- నకిలీ విత్తనాలు: నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం.
- మూసీ కాలుష్యం: మూసీ నది కాలుష్యాన్ని నివారించి రైతుల సాగు భూములను కాపాడాలని కోరడం.

నిమ్మ, బత్తాయి రైతులు: నిమ్మ, బత్తాయి రైతులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేయడం.

- పత్తి రైతులు: పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడం.
- ఉమ్మడి రైతు ఉద్యమం: రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాలతో కలిసి సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం.

ఈ పది తీర్మానాల వివరాలను సమావేశానికి సంబంధించిన వార్తా నివేదికలు కూడా వెల్లడించాయి. ?

ఈ తీర్మానాలు ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై దృష్టి సారిస్తున్నాయి. అయితే వీటితోపాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ప్రైవేట్ పెట్టుబడులు, పరిశోధన, మార్కెట్ విస్తరణ వంటి దీర్ఘకాలిక అంశాలను కూడా పార్టీ తన వ్యవసాయ విధానంలో భాగం చేయాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రక్షణ సేన వ్యవసాయ ప్రణాళిక ఎలా ఉండాలి?

రైతుల సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తడం ఒక బాధ్యత. అయితే ఒక రాజకీయ పార్టీ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలంటే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రజల ముందుంచాలి.

- రైతుకు ఆదాయ భద్రత: రైతు పెట్టుబడి సహాయం, పంట బీమా, కౌలు రైతులకు గుర్తింపు, వ్యవసాయ రుణాల సదుపాయాలను సమగ్రంగా రూపొందించాలి.
- వ్యవసాయానికి ప్రత్యేక పెట్టుబడి విధానం: ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు అగ్రిటెక్ పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్, గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించాలి.
- వ్యవసాయ యాంత్రీకరణ: ప్రతి మండలంలో వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాలు, డ్రోన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చిన్న రైతులకు రాయితీపై ఆధునిక యంత్రాలు అందించాలి.
- విత్తనాలు, ఎరువుల నాణ్యత: కంపెనీల లైసెన్సులు, డీలర్ల అనుమతులు, ఉత్పత్తుల నాణ్యతపై నిరంతర తనిఖీలు జరగాలి. ప్రతి జిల్లాలో నాణ్యత పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండాలి.
- పరిశోధన-రైతు అనుసంధానం: వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేట్ టెక్నాలజీ కంపెనీలు, రైతుల మధ్య భాగస్వామ్యం పెంచాలి. కొత్త సాంకేతికతను రైతుల పొలాల్లో ప్రదర్శించి శిక్షణ ఇవ్వాలి.
- పంటలకు మార్కెట్, బ్రాండింగ్: తెలంగాణ జిల్లాల ప్రత్యేక పంటలకు ప్రాంతీయ బ్రాండింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతుల అవకాశాలు కల్పించాలి. రైతులు నేరుగా మార్కెట్లతో అనుసంధానం అయ్యే వ్యవస్థను రూపొందించాలి.
- విద్యుత్ టవర్లకు పరిహారం: హైటెన్షన్ టవర్లు, విద్యుత్ లైన్ల నిర్మాణం వల్ల భూములకు, పంటలకు జరిగే నష్టానికి చట్టబద్ధమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.
- వ్యవసాయ కూలీల సంక్షేమం: ఉపాధి హామీ పథకం, వ్యవసాయ పనుల మధ్య సమన్వయాన్ని పరిశీలించి రైతులకు కూలీల లభ్యత, కూలీలకు ఉపాధి భద్రత కల్పించాలి.
- పంటల వైవిధ్యీకరణ: వాతావరణం, నేల స్వభావం, నీటి



లభ్యత ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రీయ సలహాలు ఇవ్వాలి. పంట మార్పిడికి అవసరమైన మార్కెట్, కొనుగోలు భరోసా కల్పించాలి.

- రైతుల భాగస్వామ్య పాలన: మండల, జిల్లా స్థాయిలో రైతు సలహా మండళ్లు ఏర్పాటు చేసి వ్యవసాయ విధానాల రూపకల్పనలో రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రకటనల నుంచి కార్యాచరణ వరకు..
కవిత ముందు ఉన్న ప్రధాన సవాలు!

తెలంగాణ రక్షణ సేన వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించడం, రైతుల ఆత్మగౌరవం, మార్కెట్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలను తన రాజకీయ ఎజెండాలో ప్రస్తావిస్తోంది. అయితే ఈ ఆలోచనలు ఆచరణలోకి రావాలంటే సమగ్ర వ్యవసాయ విధానం, ఆర్థిక వనరులు, కాలపరిమితి, బాధ్యతాయుతమైన అమలు వ్యవస్థ అవసరం. ప్రత్యేకంగా తెలంగాణలోని చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వేర్వేరుగా అధ్యయనం చేయాలి.

పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ రైతుల సమస్యలను అధ్యయనం చేసే శాశ్వత వ్యవసాయ విధాన కమిటీని ఏర్పాటు చేయగలదా? ప్రతి జిల్లాలో రైతులతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించగలదా? వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, మార్కెట్ ప్రతినిధులు, రైతు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకురాగలదా?

అదే సమయంలో ప్రకటించే హామీలకు ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తాయి? ఏ పథకం ఎంతమంది రైతులకు ప్రయోజనం కల్పిస్తుంది? అమలు గడువు ఎంత? ఫలితాలను ఎలా కొలుస్తారు? అనే వివరాలతో సమగ్ర వ్యవసాయ మేనిఫెస్టోను ప్రజల ముందుంచాలి. రైతు సమస్యలపై రాజకీయ ప్రకటనలు చేయడం కంటే, రైతు జీవితంలో కనిపించే మార్పును తీసుకురావడం అత్యంత ముఖ్యం.

ముగింపు: రైతును కాపాడటం అంటే తెలంగాణ ఆర్థిక భవిష్యత్తును కాపాడటమే!

వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే రైతుకు కేవలం హామీలు సరిపోవు. ఆధునిక సాంకేతికత, పరిశోధన, పెట్టుబడులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, యాంత్రీకరణ, గిట్టుబాటు ధర, ఆర్థిక భద్రత అన్నీ సమన్వయంతో పనిచేయాలి. ప్రపంచ దేశాలతో పోటీపడే పారిశ్రామిక, ఫార్మాస్యూటికల్, సాంకేతిక రంగాలను అభివృద్ధి చేస్తున్న మన దేశం వ్యవసాయ రంగాన్ని కూడా అదే దృష్టితో చూడాలి. రైతును కేవలం ఆహార ఉత్పత్తిదారుడిగా కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగస్వామిగా గుర్తించాలి. తెలంగాణలో వ్యవసాయానికి సంబంధించి కల్వకుంట్ల కవిత, తెలంగాణ రక్షణ సేన ప్రకటిస్తున్న ఆలోచనలు సమగ్ర విధానంగా రూపుదిద్దుకుంటాయా? రైతులకు ఆర్థిక భద్రత, ఆధునిక టెక్నాలజీ, మార్కెట్ అవకాశాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర అందించే కార్యాచరణను రూపొందిస్తారా? అనేది భవిష్యత్తులో గమనించాల్సిన అంశం. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ అయినా రైతుల సమస్యలపై విధానాలు ప్రకటించవచ్చు. కానీ ఆ విధానాల విలువ వాటి అమలు, పారదర్శకత, రైతులకు కలిగే వాస్తవ ప్రయోజనాలతోనే నిర్ణయించబడుతుంది. దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పుకోవడం మాత్రమే నిజమైన అభివృద్ధి కాదు. దేశానికి అన్నం పెట్టే రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందా లేదా అనేదే అభివృద్ధికి అసలైన కొలమానం. రైతు తన బిడ్డను గర్వంగా రైతుగా పరిచయం చేసుకునే పరిస్థితి రావాలి. వ్యవసాయం నష్టాల వృత్తి నుంచి లాభదాయకమైన ఆధునిక ఆర్థిక రంగంగా మారాలి. తెలంగాణలోని ప్రతి వ్యవసాయ కుటుంబానికి గౌరవం, ఆదాయం, భద్రత లభించాలి. అదే నిజమైన రైతు సంక్షేమం.. అదే తెలంగాణ వ్యవసాయానికి కావాల్సిన భవిష్యత్తు!

ప్రత్యేక విశ్లేషణ క్యాతం మధుకృష్ణ, B.Tech, MS
సామాజిక, రాజకీయ విశ్లేషణ నిపుణుల

ఇందిరమ్మ ఇండ్లపై విపక్షాల విమర్శలు అర్థరహితం!

కలెక్టర్ మార్గదర్శకాల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక.. పూర్తి పారదర్శకతతో కేటాయింపులు.

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే

పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్



ప్రజా వాయిస్ / పాలకుర్తి / నవంబర్ 11:
ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న విమర్శలు పూర్తిగా అర్థరహితమని పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు.మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేసిన విమర్శలను ఖండిస్తూ, బుధవారం పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కలెక్టర్ మార్గదర్శకాల ప్రకారమే ఎంపిక
ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ప్రభుత్వం పూర్తి పారదర్శకతను పాటిస్తోందని పోగు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించి, గ్రామ కార్యదర్శుల ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించినట్లు వివరించారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని, అర్హతే ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ కొనసాగిందని స్పష్టం చేశారు.

రాజకీయ ఉనికి కోసమే విమర్శలు
నిరుపేదలకు ఇళ్లు అందుతున్న విషయాన్ని జీర్ణించుకోలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కొడకండ్ల నూతన ఎస్ఐ పిట్టల తిరుపతి

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి!

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

కొడకండ్ల నూతన ఎస్ఐకి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచన

ప్రజా వాయిస్ / పాలకుర్తి నవంబర్ 11
కొడకండ్ల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. ఇటీవల కొడకండ్ల మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పిట్టల తిరుపతి బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం కలిగించేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు.ముఖ్యంగా మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తూ కొడకండ్ల మండలంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

పంచాయితీ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం

గ్రామ సమగ్ర అభివృద్ధి కృషి చేస్తా

సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి



జూలూరుపాడు, ప్రజా వాయిస్:
మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఉప సర్పంచ్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. అదే విధంగా పంచాయితీ పరిధిలోని దండుమిట్ట తండా వివో బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ కుమారి మాట్లాడుతూ వివిజి రాంజీ పథకం ద్వారా గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి 20 లక్షలు, వివో బిల్డింగ్ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరి అయినట్లు తెలిపారు. వీటితోపాటు దేశ్యా తండా, దండు మిట్ట తండా, కాలనీ, నర్సాపురం హ్యాబిటేషన్లలో సుమారు 35 లక్షల రూపాయల అంచనాలతో సిసి రోడ్లు మంజూరి అయినట్లు తెలిపారు. త్వరలోనే రోడ్ల నిర్మాణ పనులను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. పడమట నర్సాపురం గ్రామ పంచాయతీ అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరి చేస్తూ, పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, అభివృద్ధి బాటలో నడిపిస్తున్న వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ కి గ్రామపంచాయతీ తరపున ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే ఆశీస్సులతో గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించటం తో పాటు, అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్యం, త్రాగునీరు తదితర ప్రజా అవసరాలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కృష్ణ, వార్డు సభ్యులు బాదావత్ రాంకోటి, దామెర్ల రాములు, ధారావత్ రాము, కిన్నెర మమత, పాపిని నాగమణి, బాదావత్ మౌనిక, గ్రామ దీపిక తేజావత్ శారద తోపాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పీరం చెరువుపై అధికారుల అలసత్వమా..?

అక్రమార్కులకు అనుకూలమా..?

అధికారుల నిర్లక్ష్యానికి కనుమరుగవుతున్న చెరువు

రికార్డుల్లో 34.29 ఎకరాలు...క్షేత్రస్థాయిలో పది ఎకరాలేనా?

సర్వే నంబర్ల గందరగోళం తేల్చకుండానే హైడ్రా కంచె ఎందుకు.?

ఎవరి ప్రయోజనాల కోసం కంచె ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికుల ఆగ్రహం

రెవెన్యూ,ఇరిగేషన్, హెచ్ఎండీపీ,హైడ్రా, జీహెచ్ఎంసీ,జలమండలి, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సమన్వయం ఏదీ.?

ఏసీ గదుల్లో సమీక్షలకే పరిమితమా..?

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఏదీ.?

రంగంలోకి ఏసీబీ దిగాల్సిందే అంటున్న జాగిర్ ప్రజలు



కుంచించుకు పోతున్న పీరం చెరువు

ప్రజావాయిస్॥ రాజేంద్రనగర్:
చెరువులను కాపాడాల్సిన అధికారుల నిర్లక్ష్యమా..? లేక అక్రమార్కులకు పరోక్షంగా కలిసొస్తున్న వ్యవస్థలోని లోపాలా..? రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగిర్ ప్రధాన రహదారిపై ఉన్న వందల ఏళ్ల చరిత్ర కలిగిన పీరం చెరువు పరిస్థితి ఇప్పుడు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒకప్పుడు 34 ఎకరాల 29 గుంటల విస్తీర్ణంలో ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైన చెరువు ప్రస్తుతం పది ఎకరాలు కూడా మిగలని స్థితికి చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెరువు పరిరక్షణ కోసం హైడ్రా కంచె ఏర్పాటు చేస్తున్నప్పటికీ, అసలు చెరువు విస్తీర్ణం, సరిహద్దులు,సర్వే నంబర్ల వివాదంపై మాత్రం స్పష్టత రావడం లేదని విమర్శిస్తున్నారు.చెరువును పరిరక్షించాల్సిన ఏడు కీలక శాఖలు ఉన్నా పీరం చెరువుకు ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

రికార్డుల్లో 34.29 ఎకరాలు...మరి మిగిలిన భూమి ఏమైంది?
గండిపేట మండలం బండ్లగూడ జాగిర్ పరిధి చేవెళ్ల బీజాపూర్ ప్రధాన రహదారికి అనుకుని ఉన్న పీరం చెరువు అసలు విస్తీర్ణం గ్రామ నక్షపహాణీ తదితర రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్ 10లో 34 ఎకరాల 29 గుంటలుగా నమోదై ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం చెరువు విస్తీర్ణం పది ఎకరాలకే పరిమితమైందన్నది వారి ప్రధాన వాదన.ఇంత పెద్ద విస్తీర్ణంలో ఉన్న చెరువు భూమి క్రమంగా ఎలా తగ్గిపోయింది.? మిగిలిన భూమి ఎక్కడికి వెళ్లింది.ఆక్రమణలు జరిగితే వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు ఇన్నాళ్లూ ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సర్వే నంబర్ 10లో చెరువు...ప్రణాళికలో 9,11 ఎలా చేరాయి?
పీరం చెరువు విషయంలో మరో కీలక వివాదం సర్వే నంబర్ల చుట్టూ తిరుగుతోంది.రెవెన్యూ రికార్డుల్లో చెరువు సర్వే నంబర్ 10లో 34.29 ఎకరాలుగా నమోదై ఉండగా,హెచ్ఎండీఏ రూపొందించిన చెరువు ప్రణాళికలో పక్కనే ఉన్న సర్వే నంబర్లు 9,11లను కూడా చేర్చడం వివాదానికి దారితీసింది.అసలు చెరువు భూమి ఒక సర్వే నంబర్‌లో ఉండగా,పక్కనున్న పట్టా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు చెరువు ప్రణాళికలోకి ఎలా వచ్చాయి.? వాటిని చేర్చడానికి ప్రాతిపదిక ఏమిటి.? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఒకవైపు పట్టా భూముల యజమానులు తమ భూములు చెరువు పరిధిలోకి వచ్చాయంటూ ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు చెరువు అసలు విస్తీర్ణం తగ్గిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ రికార్డులు, హెచ్ఎండీఏ చెరువు ప్రణాళిక,క్షేత్రస్థాయి పరిస్థితిని పోల్చి చూస్తేనే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

హైడ్రా కంచె వేస్తోంది.. అసలు హద్దులపై స్పష్టత ఏది?
చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా కంచె ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పీరం చెరువు విషయంలో కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.అసలు చెరువు విస్తీర్ణాన్ని నిర్ధారించకుండా,సర్వే నంబర్ల వివాదాన్ని పరిష్కరించకుండా కంచె ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఎవరి ప్రయోజనాల కోసం హైడ్రా కంచె ఏర్పాటు చేస్తోంది.? చెరువు పరిరక్షణే లక్ష్యమైతే 34.29 ఎకరాల అసలు విస్తీర్ణాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు.? కంచె ఏ రికార్డుల ఆధారంగా ఏర్పాటు చేస్తున్నారు.? అంటూ నిలదీస్తున్నారు.



చెరువులో వెలసిన బోర్డు

ఏడు శాఖలు...చెరువు బాధ్యత ఎవరిది?
పీరం చెరువు పరిరక్షణ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు హెచ్ఎండీఏ,హైడ్రా, జీహెచ్ఎంసీ,జలమండలి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. అయితే ఇన్ని శాఖలు ఉన్నప్పటికీ చెరువు పరిస్థితిలో మార్పు ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.రెవెన్యూ శాఖలి:పాత గ్రామ నక్షపహాణీలు,సర్వే రికార్డుల ఆధారంగా చెరువు అసలు విస్తీర్ణం,సర్వే నంబర్లు,ప్రభుత్వ భూముల హద్దులను నిర్ధారించాలి. సర్వే నంబర్లు 9,10,11లకు సంబంధించిన వివాదాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి.

ఇరిగేషన్ శాఖ:చెరువు అసలు ఎఫ్‌టీఎల్,నీటి విస్తీర్ణం,చెరువు కట్ట, తూములు,నీటి ప్రవాహ మార్గాలను సాంకేతికంగా నిర్ధారించాలి.చెరువు భూముల్లో ఆక్రమణలు, గతంలో జారీ చేసిన ఎన్ఓసీల వ్యవహారాన్ని పరిశీలించాలి.

హెచ్ఎండీపీ:చెరువు ప్రణాళికలో చేర్చిన సర్వే నంబర్లు,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ వివరాలకు సంబంధించిన ఆధారాలను వెల్లడించాలి.పాత రెవెన్యూ రికార్డులు,ప్రస్తుత ప్రణాళికల మధ్య వ్యత్యాసాలను పరిశీలించాలి.

హైడ్రా:చెరువు భూముల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలి.కంచె ఏర్పాటు చేస్తున్న హద్దులకు సంబంధించిన ఆధారాలను స్పష్టం చేయాలి.ఆక్రమణలు నిర్ధారణ అయితే చట్టప్రకారం తొలగింపు చర్యలు చేపట్టాలి.

జీహెచ్ఎంసీ:చెరువు పరిసరాల్లో అక్రమ నిర్మాణాలు,నిర్మాణ వ్యర్థాల డంపింగ్,చెత్త పారవేతను అరికట్టాలి. మురుగునీరు చెరువులోకి చేరకుండా చర్యలు చేపట్టాలి.అక్రమంగా నిర్మిస్తున్న భవనాలకు నిర్మాణాలు పూర్తి చేసుకున్న నిర్మాణంలో ఉన్న వాటికి ఎలా ఎన్వోసీలు జారీ చేశారన్నదే ప్రశ్నార్థకం.

జలమండలి:చెరువులోకి చేరుతున్న మురుగునీటి ప్రవాహాలను గుర్తించి, డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలి.అవసరమైన చోట మురుగునీటి శుద్ధి చర్యలు చేపట్టాలి.

కాలుష్య నియంత్రణ మండలి: చెరువు నీటి నాణ్యతను పరీక్షించి, కాలుష్యానికి కారణమవుతున్న వనరులను గుర్తించాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలు,వనరులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.ఇలా ఒక్కో శాఖకు ఒక్కో బాధ్యత ఉన్నప్పటికీ,సమగ్ర పరిరక్షణకు సంయుక్త కార్యాచరణ అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక శాఖ మరో శాఖ వైపు చూపిస్తూ బాధ్యత నుంచి తప్పించుకుంటే చివరకు నష్టపోయేది చెరువేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్ఓసీల వ్యవహారం...ఇప్పుడు మళ్లీ అధికారుల పాత్రపై ప్రశ్నలు
పీరం చెరువుకు సంబంధించి గతంలో ఎన్ఓసీల జారీ వ్యవహారంలో ఓ ఇరిగేషన్ అధికారి ఏసీబీ విచారణకు గురైనట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు.ఈ నేపథ్యంలో గతంలో జారీ చేసిన ఎన్ఓసీలు,నిర్మాణ అనుమతులు,చెరువు హద్దుల నిర్ధారణకు సంబంధించిన పత్రాలను ఉన్నతాధికారులు మరోసారి పరిశీలించాలని కోరుతున్నారు.ఎవరెవరికి ఎన్ఓసీలు జారీ చేశారు.? ఏ ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారు.? చెరువు పరిధిలో నిర్మాణాలకు అనుమతులు లభించాయా.? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

పక్షుల ఆవాసం...నేడు కళేబరాల ఆనవాళ్లు
ఒకప్పుడు దేశవిదేశాల నుంచి వలస వచ్చే పక్షులకు పీరం చెరువు ప్రధాన ఆవాసంగా ఉండేదని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. నీటితో కళకళలాడిన చెరువు పరిసరాలు పక్షుల కిలకిలారావాలతో సందడిగా ఉండేవని చెబుతున్నారు.ప్రస్తుతం చెరువు కుంచించుకుపోవడం, కాలుష్యం,నీటి వనరులు తగ్గిపోవడంతో పక్షుల కళేబరాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెరువు పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిసర ప్రాంతాల్లోని వేలాది నివాసాల భూగర్భ జలాలపైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

కంచెతో సరిపెడతారా..? ఏడు శాఖలు రంగంలోకి దిగుతాయా
పీరం చెరువుకు సంబంధించిన పాత గ్రామ నక్ష,పహాణీలు,రెవెన్యూ రికార్డులు,హెచ్ఎండీఏ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి సంయుక్త క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ,ఇరిగేషన్, హెచ్ఎండీఏ,హైడ్రా అధికారులు చెరువు అసలు హద్దులను నిర్ధారించడంతో పాటు జీహెచ్ఎంసీ, జలమండలి,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా తమ పరిధిలోని సమస్యలపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.34 ఎకరాల 29 గుంటలుగా రికార్డుల్లో నమోదైన చెరువు ప్రస్తుత పరిస్థితికి ఎలా చేరుకుంది.? సర్వే నంబర్లలో మార్పులు జరిగాయా.? గతంలో జారీ చేసిన ఎన్ఓసీలు,నిర్మాణ అనుమతుల వెనుక ఉన్న వాస్తవాలేమిటి.? కంచె ఏర్పాటు ఏ ప్రాతిపదికన జరుగుతోంది.? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.చెరువులు కనుమరుగైన తర్వాత భూగర్భ జలాలను కాపాడుకోవాలని ప్రజలకు సూచనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కేవలం కంచెలు ఏర్పాటు చేయడం కాదు,చెరువు అసలు విస్తీర్ణాన్ని కాపాడటం,కాలుష్యాన్ని అరికట్టడం,ఆక్రమణలను తొలగించడం,బాధ్యులపై చర్యలు తీసుకోవడమే నిజమైన పరిరక్షణ అని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏడు శాఖల అధికారులు ఏకతాటిపైకి వచ్చి పీరం చెరువు పరిరక్షణకు కార్యాచరణ ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏసీబీ విజిలెన్స్ రంగంలోకి దిగాల్సిందేనా?
"పీరం చెరువు భూముల విస్తీర్ణం,సర్వే నంబర్లు, హద్దుల విషయంలో నెలకొన్న గందరగోళంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా,చెరువు భూముల వ్యవహారంపై ఏసీబీ,విజిలెన్స్ శాఖలతో విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు



చెరువు గ్రామ నక్ష



పహానిలో ప్రభుత్వ భూమిగా నమోదు





పీఆర్సీని వెంటనే అమలు చేయాలి..

గడువు ముగిసినా కాలయాపన చేయడం సమంజసం కాదు..

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకుబ్..

యూటీఎఫ్ నూతన బయ్యారం మండల కమిటీ ఎన్నిక..

అధ్యక్ష, కార్యదర్శులుగా గంగావత్ వెంకన్న, భూక్య అరుణాదేవి

ప్రజా వాయిస్ బయ్యారం..
ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకోబ్ డిమాండ్ చేశారు. పీఆర్సీ అమలుకు నిర్ణయించిన గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం ఇంకా కాలయాపన చేయడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక సీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. పీఆర్సీ అమలుపై ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం నిర్వహించిన యూటీఎఫ్ మహాసభలో నూతన బయ్యారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా గంగావత్ వెంకన్నను, కార్యదర్శిగా భూక్య అరుణాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల సాధన, విద్యారంగ అభివృద్ధి కోసం యూటీఎఫ్ నిరంతరం కృషి చేయాలని మహాసభలో పలువురు నాయకులు ఆకాంక్షించారు.

మౌలానా ఆజాద్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

కోదాడలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు



ప్రజా వాయిస్, కోదాడ:
భారత స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన 138వ జయంతి వేడుకలను కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ డివిజన్ అధ్యక్షుడు బాజన్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వంగవీటి రామారావు గ్రంథాలయ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం మౌలానా ఆజాద్ చేసిన త్యాగాలు, విద్యారంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కంపాటి శ్రీను, వార్డు కౌన్సిలర్ షఫీ, కౌన్సిలర్ నరసయ్య, గంధం యాదగిరి, పంది తిరుపతయ్య, ఖలీల్, హస్సా, షఫీ, బాగ్దాద్, షేక్ గోరే సాహెబ్, హాసిం భాయ్, జానీ బాబా, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



వచ్చే విద్యా సంవత్సరం లోగా పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

మంత్రి ఉత్తమ్

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 11:

కోదాడ నియోజక వర్గంలోని చిలుకూరు గుట్టలలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల, కోదాడ లో రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర పౌరసరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా మంత్రి చిలుకూరు గుట్టలో 200 కోట్ల రూపాయలతో 22 ఎకరాలలో నిర్మాణం చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బేస్మెంట్, కాంక్రీట్, పిల్లర్ల పనుల పురోగతి, నిర్మాణం పై సంబంధిత గుత్తందార్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, 2027--28 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిం చుటకు సిద్ధం చేయాలని అన్నారు. తదుపరి కోదాడ లో 50 కోట్ల రూపాయాలతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై గుత్తందారులతో సమీక్షించారు. భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రారంభించుటకు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కే నరసింహ, ఆధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ ప్రాంతం నుంచి హైకోర్టు న్యాయవాదిగా గుర్తింపు

అంగన్వాడి టీచర్ కుమారుడు హైకోర్టు న్యాయవాదిగా బాధ్యతలు..

హర్షం వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ హర్షద్ జామా పటేల్..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల పరిధిలోని మద్ది గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త బేగరి సునీత కుమారుడు బేగరి నర్సింహ హైకోర్టు న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అయినటువంటి హర్షద్ పటేల్ ఆయనకు అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఒక్క సాధారణ కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా నర్సింహ భవిష్యత్తులో న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ ఆకాంక్షించారు.

రైతు గర్జనలో హరీశ్‌రావు ఫొటో మాయం.!

నిర్మల్ సభ ఫ్లెక్సీల్లో కేసీఆర్, కేటీఆర్‌లకే చోటు

గులాబీ శిబిరంలో చర్చనీయాంశంగా మారిన వైనం

ఉద్దేశపూర్వకంగానే తొలగించారా.? స్థానిక నేతల పారపాటా.?

ప్రజా వాయిస్,నిర్మల్:



బీఆర్ఎస్‌లో నాయకుల ప్రాధాన్యతపై మరోసారి చర్చ మొదలైంది. నిర్మల్‌లో నిర్వహించనున్న రైతు గర్జన సభకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగుల్లో మాజీ మంత్రి, పార్టీ కీలక నేత హరీశ్‌రావు ఫొటో కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సభకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరవుతుండగా, ప్రచార చిత్రాల్లో కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు స్థానిక నాయకుల ఫొటోలను పొందుపరిచారు. అయితే హరీశ్‌రావుకు మాత్రం చోటు కల్పించలేదు.పార్టీలో కీలక నేతగా ఉన్న హరీశ్‌రావు ఫొటో లేకపోవడం వెనుక కారణమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా లేక స్థానిక నాయకుల ఏర్పాట్లలో జరిగిన పొరపాటా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్‌లో నాయకుల ప్రాధాన్యతపై సాగుతున్న ప్రచారానికి ఈ పరిణామం మరింత ఊతమిచ్చింది. కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య ప్రాధాన్యత విషయంలో ఏమైనామార్పులున్నాయా అన్న చర్చ గులాబీ శ్రేణుల్లో ఆసక్తి కలిగిస్తోంది.

వ్యవసాయ రంగ పరిరక్షణకు రైతులంతా ఏకం కావాలి

ఈనెల 15న నల్గొండలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య

ప్రజావాయిస్ / పాలకుర్తి

ఈనెల 15 నుంచి 18 తేదీ వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు.బుధవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సంఘాల సమావేశం శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షురాలు బచ్చు శ్రీలత అధ్యక్షత వహించగా సోమయ్య పాల్గొని మాట్లాడుతూ రైతాంగ హక్కుల సాధన వ్యవసాయ రంగం పరిరక్షణ కోసం ఏఐకేఎస్ నిరంతరం పోరాడుతుందని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 13 నెలల పాటు సాగిన చారిత్రక రైతు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని, కరువు ప్రాంతాల్లో పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో విదేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులకు సుంకాలు లేకుండా దిగుమతికి అవకాశం ఇచ్చి దేశ రైతులను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. సాదా బైనామ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కౌలు రైతులను గుర్తించాలని కోరారు,ఈనెల 15న నల్గొండలో జరిగే భారీ బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సోమన్న, ఉపాధ్యక్షులు సొమసత్యం, తెలంగాణ రజక



వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్, ఏవో ఐ (ఎల్ఐసి) రాష్ట్ర నాయకులు సోమ అశోక్ బాబు, రైతు సంఘం మండల కార్యదర్శి బెల్లి సంపత్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కాకర్ల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కాకర్ల పద్మ, అధ్యక్షులు కాకర్ల బాబు, సిఐటియు నాయకులు మాసంపల్లి నాగయ్య, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు ముస్కు ఇంద్రారెడ్డి, అనపర్తి శోభన్, కే రేణుక, ఎల్లమ్మ, చంద్రయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు

మాజీ ఎమ్మెల్యేదేశిని చిన మల్లయ్య సేవలు మరువలేనివి...!

గీతా కార్మికుల హక్కుల కోసం చిన్న మల్లయ్య నిరంతర పోరాటం..!!

నేటి రాజకీయ నేతలకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం

బుర్ర శ్రీనివాస్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజా వాయిస్ హుస్నాబాద్

హుస్నాబాద్ ప్రాంత ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే, ప్రజా నాయకుడు స్వర్గీయ దేశిని చిన మల్లయ్య గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నట్లు, ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో జన్మించిన దేశిని చిన మల్లయ్య ఇందుర్తి నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు విశేష సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడిగా వెట్టి చాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా, భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించడంతో పాటు కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి దేశిని చిన మల్లయ్య అని గుర్తు చేశారు.ప్రజా ఉద్యమాల ద్వారా సమాజ మార్పు కోసం జీవితాంతం కృషి చేసిన దేశిని చిన మల్లయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.



ఆజాద్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి!

దేశ విద్యా వ్యవస్థకు ఆయన వేసిన పునాదులు చిరస్మరణీయం: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని చాటిచెప్పిన మహనీయుడు

మత సామరస్యానికి, జాతీయ సమైక్యతకు అంకితమైన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్

ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక భూమిక పోషించిన మహనీయుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జనగామ శాసనసభ్యులు (మీూూ) డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం (నవంబర్ 11) జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మరియు జనగామ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విద్యాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు విశేష కృషి:

అనంతరం పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు, అభివృద్ధి సాధ్యమవుతాయని నమ్మిన దార్శనికుడు ఆజాద్ అని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించి, దేశ విద్యా రంగానికి బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలకుల అణచివేతను ఎదుర్కొంటూనే తన రచనలు, పత్రికల ద్వారా ముస్లిం యువతను స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపించారని తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక



మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి అగ్రనేతలతో కలిసి పోరాడిన ఆజాద్, దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించి హిందూ-ముస్లిం ఐక్యత కోసం చివరి వరకు కృషి చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు ఆయన చేసిన త్యాగాలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు, జనగామ పట్టణ శాఖ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ భారతి రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి

భూ రికార్డుల ఆధునీకరణ, భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ మను చౌదరి

ప్రజావాయిస్, కీసర :

భూ భారతి రీ-సర్వే ప్రక్రియపై రైతులకు, గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించేందుకు బుధవారం కీసర మండలం బోగారం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొని రీ-సర్వే ప్రక్రియ, దాని విధివిధానాలు, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రికార్డులను ఆధునీకరించడం, భూ సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం, రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. 1954 నాటి రికార్డులతో ఆధునిక సాంకేతికత అనుసంధానం, రీ-సర్వేలో భాగంగా 1954 నాటి పాత భూ సర్వే రికార్డుల సమాచారాన్ని సేకరించి, ప్రస్తుతం నిర్వహించే కొత్త రీ-సర్వే వివరాలతో సరిపోల్చి నవీకరిస్తారని వివరించారు. శాటిలైట్ సాంకేతికత ఆధారంగా ప్రతి భూభాగాన్ని ఖచ్చితమైన భౌగోళిక కో-ఆర్డినేట్స్‌తో గుర్తించి, డిజిటల్ కో-ఆర్డినేట్స్‌తో కూడిన ప్రత్యేక నంబర్ కేటాయించి రికార్డుల్లో నమోదు చేస్తారని తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు (పొలిమేరలు), గ్రామ



పరిధిలోని భూములు, చెరువులు, ప్రభుత్వ భూములు, పట్టా భూములను స్పష్టంగా వర్గీకరించి వాటి సరిహద్దులను ఖరారు చేస్తారని పేర్కొన్నారు. ఏ రోజు ఏ సర్వే నంబర్లలో కొలతలు చేపడతారనే వివరాలను రైతులకు ముందుగానే నోటీసుల ద్వారా తెలియజేస్తారని చెప్పారు. రోజుకు సుమారు 30 నుంచి 40 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తూ, నెల రోజుల్లో ఒక గ్రామంలో రీ-సర్వే ప్రక్రియను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

రైతులకు అనేక ప్రయోజనాలు

భూ భారతి రీ-సర్వే ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ వివరించారు. సర్వే సమయంలో రైతుల సమక్షంలోనే భూమికి నాలుగు వైపులా మార్కింగ్ చేసి సరిహద్దులు నిర్ధారిస్తారని తెలిపారు. సరిహద్దు సమస్యలు, భూమి పొజిషన్‌లో మార్పులు ఉన్నట్లయితే అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.తల్లిదండ్రుల పేర్లపై ఉన్న భూములకు సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య భవిష్యత్తులో సరిహద్దు వివాదాలు తలెత్తకుండా భూములను సక్రమంగా గుర్తించి పంపిణీ చేసుకోవడానికి రీ-సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక సర్వే నంబర్ పరిధిలోని రైతులందరూ హాజరైతే భూముల వివరాల్లో తప్పులు, అపోహలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే రీ-సర్వే సమయంలోనే లేదా అనంతరం సంబంధిత అధికారులకు అర్జీ సమర్పించి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

రైతులందరూ తప్పనిసరిగా హాజరుకావాలి

రీ-సర్వే నిర్వహించే సమయంలో సంబంధిత సర్వే నంబర్‌కు చెందిన ప్రతి రైతు ప్రత్యక్షంగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పట్టాదారులు అందుబాటులో లేకపోతే వారి కుటుంబ సభ్యులు హాజరై తమ భూములను సర్వే అధికారులకు చూపించవచ్చని తెలిపారు. గ్రామ సభకు హాజరైన రైతులు, గ్రామస్తులు ఈ సమాచారాన్ని గ్రామంలోని ఇతర రైతులకు కూడా తెలియజేసి రీ-సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అవగాహన సదస్సులో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ, అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ ల్యాండ్స్, కీసర తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

జ్యోతిబా ఫూలే బాలికల పాఠశాలలో
ఆటల పోటీలను ప్రారంభించిన ఎంపీ గోడం నగేష్

ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీ.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని వ్యాఖ్య

కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు





ప్రజా వాయిస్, /ఆదిలాబాద్

ఆదిలాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడా పోటీలను ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, స్థానిక శాసనసభ్యులు పాయల్ శంకర్‌తో కలిసి మంగళవారం వైభవంగా ప్రారంభించారు. క్రీడా మైదానంలో జెండా ఊపి పోటీలను ప్రారంభించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొని తమలోని ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలోనూ క్రీడలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి పాఠశాల స్థాయి పోటీలు ఎంతగానో తోడ్పడతాయని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మన జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పథకాలు సాధించి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. పోటీల ప్రారంభోత్సవం అనంతరం పలు ఆటలను స్వయంగా వీక్షించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, కౌన్సిలర్ ఆత్రం సాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, నిర్వహకులు, విద్యార్థినులు మరియు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచేందుకే పోటీలు

- ఎన్నికల విధులపై క్విజ్, వ్యాసరచన పోటీల నిర్వహణ

- మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, నవంబర్ 11:

విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల వ్యవస్థ, ఎన్నికల సంఘం విధులపై అవగాహన పెంపొందించేందుకే క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎలక్టోరల్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల సంఘం బాధ్యతలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ దౌల్తాబాద్‌కు చెందిన దినిష మొదటి బహుమతి, తెలంగాణ మోడల్ స్కూల్ దౌల్తాబాద్‌కు చెందిన రిజ్వాన రెండో బహుమతి, జెడ్పీహెచ్ఎస్ ఇందుప్రియల్‌కు చెందిన డి. ప్రణవి మూడో బహుమతి సాధించారు.క్విజ్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ ఇందుప్రియల్‌కు చెందిన వి. మోహన్ దేవ్, జి. ఉమాచరణ్ మొదటి బహుమతి సాధించగా, జెడ్పీహెచ్ఎస్ తిరుమలాపూర్‌కు చెందిన కె. అశ్విత, జి. సంపూర్ణ రెండో బహుమతి సాధించారు.మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 15న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎంఈఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జంపన్న, దశరథం, శ్రీనివాస్, రాజు, మహేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు - పాల్గొన్న ఆడే గజేందర్

స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి జయంతి వేడుకలకు కాంగ్రెస్ ఇంచార్జి ముఖ్య అతిథి

దేశ విద్యారంగ అభివృద్ధికి, మతసామరస్యానికి ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడవు

మహనీయుని ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపు.



ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం

ఇచ్చోడ మండల కేంద్రంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప విప్లవ వీరుడని, స్వతంత్ర భారతంలో విద్యారంగ పునాదులు బలంగా వేసిన మహోన్నత దార్శనికుడని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, ఆర్థిక పురోగతి సాధ్యమవుతాయని నమ్మిన నాయకుడని తెలిపారు. దేశ ఐక్యత, మతసామరస్యం, సోదరభావం కోసం ఆయన చేసిన త్యాగాలు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. యువత ఆయన బాటలో నడుస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల పార్టీ అధ్యక్షుడు కళ్యాం నారాయణ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ నెట్ క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమయ్య, జిల్లా మైనారిటీ వైస్ చైర్మన్ ముస్తఫా, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫరూఖ్, కార్యదర్శి అబ్దుల్ రషీద్, సద్దాం, మైనారిటీ చైర్మన్ ఇక్బాల్, నాయకులు చోలే ప్రభాకర్, జాహిద్ మొహియుద్దీన్, షబ్బీర్, షేక్ మెహబూబ్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ పాటిల్, శరత్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరడి పంటలతో అదిక దిగుబడులు...

- ఆయిలపామ్ సాగుపై అవగాహన

ప్రజా వాయిస్/దుబ్బాక :

రైతులు ఆర్తడి పంటలు వేసి అది కావాలి పొందాలని, ఎల్ నీనో పరిస్థితిలో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ రైతువేదిక లో రైతులకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల్లో ఉన్న నీరుని జాగ్రత్తగా వాడుకుంటూ పాటించవలసిన జాగ్రత్తలు, పంట మార్పిడి ఉపయోగం వివరించారు. యాసంగి లో భూగర్భ జలాలు తగ్గడం, విద్యుత్ సమస్యలు, చెరువులు కాలువలలో నీరు లేకపోవటం సమస్య ల వలన వరి పంట సాగు ఇబ్బంది అవుతుంది కావున వరి పంటకు బదులుగా అరుతడి పంటలయి న మక్కజొన్న, పొద్దు తిరుగుడు, పెసర్లు, బొబ్బర్లు మొ పంటలు వేసుకోవాలని సూచించారు. వరి పొలాలలో జీరో టిల్లేజ్ విధానం లో దున్నకుండా మక్క సాగు గురించి వివరించారు.ఉద్యాన అధికారి డి . రమేష్ మాట్లాడుతూ... ఉద్యాన పంటల లాభాలు వాటి నుండి వచ్చే దిగుబడిని వివరించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరం అయ్యే నీరుతో 3 ఎకరాల వరకు కూరగాయలు సాగు చేయవచ్చు. పంట మార్పిడి చేసుకొని రైతులు పండ్ల తోటలు, కూరగాయల తోటలు పండించాలి అని కోరారు. ఎండ ప్రభావం, దీనికి ఉద్యాన శాఖ వారిచే అందించే సబ్సిడీ వివరించారు. ఆయిల్ పామ్ తోటలో నాలుగవ సంవత్సరం తరువాత ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దాని పైన కూడ రైతులకి ఉన్న సందేహాలకి సూచనలు ఇవ్వడం జరిగింది . ఆయిల్ పామ్ పంట 30 సంవత్సరాల వరకు ఉంటుంది. ఉద్యాన శాఖ వారిచే మొక్కలు, డ్రిప్ సబ్సిడీ లో అందించబడుతుంది. మొదటి 4 సంవత్సరాలు అంతర పంటలతో లాభం పొందవచ్చు. అంతర పంటలకు, ఫెర్టిలైజర్స్ కి ఎకరానికి రూ. 4200, 4 సంవత్సరాల పాటూ అందజేయటం జరుగుతుంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ ధర రూ. 22000 రూపాయలు ఉంది అని తెలిపారు.ఇందులో వ్యవసాయ అధికారి ప్రవీణ్ గారు ఉద్యాన శాఖ అధికారి డి.రమేష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అనూష, ఆయిల్ఫేడ్ ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, ఏఎంసి డైరెక్టర్ కిషన్ రెడ్డి, మల్లారెడ్డి, జీవన్ రెడ్డి, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

- సర్పంచ్ వీరమ్మ స్వాతి స్వామి

దౌల్తాబాద్, నవంబర్ 11:

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సర్పంచ్ వీరమ్మ స్వాతి స్వామి సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం సేకరణ చేపడతామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే ముందు నిబంధనల ప్రకారం శుభ్రపరచి, తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేంపల్లి కుమార్, పాలకవర్గ సభ్యులు, ఐకేపీ ఇన్‌చార్జి కనకరాజు, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం మహా పుణ్యకార్యం

రామాపురంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అమరగాని కృష్ణ



ప్రజా వాయిస్, చిలుకూరు,

నవంబర్ 11 :

నియమ నిష్ఠలతో అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములతో పాటు ఇతర భక్తులకు అన్నదానం చేయడం ఎంతో గొప్ప పుణ్యకార్యమని మీడియా టుడే దినపత్రిక జిల్లా స్టాఫర్ అమరగాని కృష్ణ అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో తన నివాసంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం నిర్వహించినారు అనంతరం స్వామివారికి పాలాభిషేకం పల్లకి సేవ నిర్వహించినారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వార్థం లేని సేవాభావంతో భక్తులకు అన్నం పెట్టడం దైవసేవతో సమానమని పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడమే కాకుండా సమాజంలో భక్తిభావం, దైవచింతన, సేవాగుణం పెంపొందుతాయని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ఉద్యోగి మృతి



ప్రజా వాయిస్,పెన్‌పహాడ్:

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా గుండెపోటు రావడంతో ఓ ఉద్యోగి మృతి చెందిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది.సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన మందుల వెంకన్న (52) నల్గొండ జిల్లా మహిళా,శిశు సంక్షేమ హక్కుల పరిరక్షణ సంస్థలో లీగల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.బుధవారం ఉదయం 9 గంటల సమయంలో వృత్తిపరమైన పనిపై ఆర్టీసీ బస్సులో మిర్యాలగూడకు వెళ్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో బస్సులోనే స్పృహ తప్పి పడిపోయారు.వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం.వెంకన్న మృతితో మాచారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఆయన భార్య స్వప్న,కుమార్తెలు ధరణి,బ్రమనశ్రీ, కుమారుడు సాయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు,బంధువుల రోదనలు పలువురిని కలచివేశాయి.





గడి బురుజు మన చారిత్రక వారసత్వ సంపద

కాపాడుకోవడం అందరి బాధ్యత: ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

అక్రమంగా విధించిన వి ఏల్ టీ ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్

ప్రజా వాయిస్, కోరుట్ల:

కోరుట్ల చారిత్రక గుర్తింపుకు ప్రతీకగా నిలిచిన గడి బురుజు స్థలాన్ని భావితరాల కోసం కాపాడుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన గడి బురుజు పరిరక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. విలువైన ఈ వారసత్వ ఆస్తిని భూకబ్జాదారుల నుంచి రక్షించుకుంటామని స్పష్టం చేశారు. స్థలంపై అక్రమంగా విధించిన వి.ఎల్.టి ని మున్సిపల్ కమిషనర్ వెంటనే రద్దు చేయాలని, ఈ ప్రదేశాన్ని పార్కు లేదా కూరగాయల మార్కెట్ వంటి ప్రజా అవసరాలకు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, అఖిలపక్ష నాయకులు ఎం.డి. ముజాహిద్, చెన్న విశ్వనాథం, తుమ్మలపల్లి శ్రీనివాస్ బాబు, చింతా భూమేశ్వర్, సుతారి రాములు, షాహేద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర హెచ్చరిక

షాపుల్లో తనిఖీలు..9,500 జరిమానా విధింపు



ప్రజా వాయిస్, కోరుట్ల:

పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే దుకాణాలు సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు పలు కిరాణా, సూపర్ మార్కెట్లలో తనిఖీలు చేసి ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వాడిన వారికి, చెత్త బయట వేసిన ఇంటి యజమానికి కలిపి ?9,500 జరిమానా విధించారు. వ్యాపారులు చెత్తను తడి, పొడి, హానికర రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలని, లేనిచో ఎస్ డబల్యూ ఎం -2026 చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ట్రేడ్ లైసెన్సులు వెంటనే రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, జవాన్లు నవీన్, చంద్రప్రకాష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



బాసర ఐఐఐటీ విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీరు అందించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

ముధోల్ నియోజకవర్గం లోని బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం బాసర ఐఐఐటీ (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్యాంపస్‌లో నీటి సరఫరా సమస్యలు, ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళి దర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కోరుట్లలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు

ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీఓ దివాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య

జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వైభవంగా పోటీల నిర్వహణ

ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్థాయికి ప్రవేశం: ఎంఈఓ గంగుల నరేశం

ప్రజా వాయిస్, కోరుట్ల:

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) దివాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంఈఓ గంగుల నరేశం, ఆర్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో భాగంగా వ్యాసరచన విభాగంలో 25 మంది, క్విజ్ విభాగంలో 22 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, విజ్ఞానాన్ని వెలికితీసేందుకే పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ పోటీల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆర్డీఓ దివాకర్ రెడ్డి వెల్లడించారు.

ఆదివాసీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా అటవీ శాఖ అధికారికి వినతిపత్రం అందజేసిన సోయం బాపూరావు

ఇందిరమ్మ ఇళ్లు, మంచినీరు, విద్యుత్, రహదారి సౌకర్యాల అనుమతుల కోసం ఫారెస్ట్ ఆఫీసర్‌కు వినతి

వంద మంది ఆదివాసులతో కలిసి సమస్యలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లిన రాజ్ గోండ్ సేవా సమితి

అటవీ శాఖ ఆంక్షలు తొలగించి గిరిజన గూడేలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్

ప్రజా వాయిస్,/ ఆదిలాబాద్

ఆదివాసీ గ్రామాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపూరావు ఆధ్వర్యంలో వందలాది మంది ఆదివాసీలు బుధవారం జిల్లా అటవీ శాఖ అధికారి (ణఖీూ) ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని వాయిపేట్, సాత్ మోరి, లచ్ఛంపూర్, కోసుపటేల్ గూడ తదితర గిరిజన గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్, నెట్‌వర్క్ వ్యవస్థలు లేక ప్రజలు పడుతున్న నరకయాతనను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం సౌకర్యాలు మంజూరు చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు ఆంక్షల పేరుతో అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు.సోయం బాపూరావు మాట్లాడుతూ... నెట్‌వర్క్ లేక అత్యవసర సమయంలో అంబులెన్స్‌కు ఫోన్ చేయలేని స్థితిలో రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి మంచి నీటి బోర్లు, బావులు తవ్వుకుందామన్నా అధికారులు అడ్డుకోవడంతో చెరువు నీరు తాగి గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వాలని, నెట్‌వర్క్ టవర్ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మాధవ్ పటేల్, మాజీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ చౌహాన్ ప్రకాష్, సర్పంచులు కుంరం దీపక్, మీరాబాయి, కస్తూరి అర్జున్, రాజగోండ్ సేవా సమితి అధ్యక్షుడు కుంరం యాదవ్ రావు మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



ఎక్మో సపోర్టుతో ఊపిరితిత్తుల మార్పిడి.. యశోద ఆసుపత్రిలో అరుదైన వైద్య విజయం!

ఆక్సిజన్‌పై ఆధారపడిన రోగికి పునర్జన్మ.. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో బైలేటరల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం

డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణ్యం



మిర్యాలగూడ,ప్రజా వాయిస్..

తీవ్రస్థాయి ఊపిరితిత్తుల వ్యాధితో ఆక్సిజన్‌పై ఆధారపడి జీవిస్తున్న రోగికి అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో యశోద ఆసుపత్రి వైద్య బృందం సరికొత్త జీవితాన్ని అందించింది. ఎక్మో (జుజమీ) సపోర్టుతో బైలేటరల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (రెండు ఊపిరితిత్తుల మార్పిడి) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ, స్లీప్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణ్యం వెల్లడించారు.బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్వాసకోశ వైఫల్యం చివరి దశలో ఉన్న రోగులకు చికిత్స అందించడంలో ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (జుజమీ) అత్యంత కీలకమైన వైద్య సాంకేతికతగా మారిందన్నారు. ఇది ఒక అధునాతన లైఫ్ సపోర్ట్ విధానమని వివరించారు.ఈ విధానంలో రోగి రక్తాన్ని శరీరం వెలుపల ఉన్న ప్రత్యేక మెంబ్రేన్ ఆక్సిజనేటర్ యంత్రం ద్వారా పంపించి, రక్తంలో ఆక్సిజన్‌ను కలిపి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తారని తెలిపారు. తద్వారా తాత్కాలికంగా ఊపిరితిత్తుల పనితీరుకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె పనితీరుకు కూడా ఈ విధానం సహాయపడుతుందన్నారు.సాధారణ వెంటిలేటర్లు, ఇతర వైద్య చికిత్సలు సరిపోని అత్యంత తీవ్రమైన శ్వాసకోశ వైఫల్య పరిస్థితుల్లో ఎక్మో ప్రాణరక్షక సాంకేతికతగా ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు సరైన దాత నుంచి ఊపిరితిత్తులు లభించే వరకు ఎక్మో ద్వారా ప్రాణాపాయ పరిస్థితిని అధిగమించే అవకాశం ఉంటుందన్నారు.అంతేకాకుండా రోగి ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం అంచనా వేసేందుకు, రోగి కోలుకునే అవకాశాలు ఉన్నాయా? లేక ఊపిరితిత్తుల మార్పిడి అవసరమా? అనే నిర్ణయం తీసుకునే సమయంలో ఎక్మో తాత్కాలిక సహాయక వ్యవస్థగా పనిచేస్తుందని వివరించారు. అయితే ఎక్మో అనేది ఊపిరితిత్తుల వ్యాధిని శాశ్వతంగా నయం చేసే చికిత్స కాదని, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో రోగి ప్రాణాలను నిలబెట్టే అధునాతన సపోర్ట్ విధానం మాత్రమేనని స్పష్టం చేశారు.చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న రోగులకు విజయవంతంగా చికిత్స అందించాలంటే కేవలం శస్త్రచికిత్స నైపుణ్యం మాత్రమే సరిపోదని డాక్టర్ విశ్వేశ్వరన్ పేర్కొన్నారు. మార్పిడి అవసరమైన రోగులను ముందుగానే గుర్తించడం, సరైన సమయంలో ఆసుపత్రికి రిఫర్ చేయడం, అత్యాధునిక క్రిటికల్ కేర్ సదుపాయాలు, ఎక్మో నిర్వహణలో నైపుణ్యం, అనుభవజ్ఞులైన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, పల్మనాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు, రిహాబిలిటేషన్ నిపుణులు, శస్త్రచికిత్స అనంతర సంరక్షణ అందించే ప్రత్యేక వైద్య బృందం సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు.ఇలాంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణుల సమన్వయంతో సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.ఈ సమావేశంలో సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ టి. రాంప్రకాష్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే దేశ ప్రగతి సాధ్యం

తొలి విద్యాశాఖ మంత్రి సేవలను స్మరించుకున్న సిద్దులకుంట విద్యార్థులు,ఉపాధ్యాయులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోనీ సిద్దులకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చాటిచెప్పారు.పాఠశాలలో సోమవారం 'జాతీయ విద్యా దినోత్సవ' వేడుకలను అత్యంత ఆకర్షణీయంగా,పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్వతంత్ర భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, మహోన్నత విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈ విద్యా సంబరాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, చేతులు జోడించి ఘన నివాళులర్పించారు.ఆధునిక భారత విద్యా వ్యవస్థకు ఆయన వేసిన పునాదులను, దేశానికి ఆయన చేసిన అమోఘమైన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బానాల నరేందర్‌తో పాటు విద్యార్థినులు మిన్ను, మనోజ్ఞలు జాతీయ విద్యా దినోత్సవ విశిష్టతపై అనర్గళంగా మాట్లాడారు.ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించడమే ఈ రోజు ముఖ్య లక్ష్యమని వారు పేర్కొన్నారు. విజ్ఞానంతోనే అజ్ఞానపు చీకట్లను పారద్రోలి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.ఈ అక్షర చైతన్య కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమారెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, బద్దం సాయిరెడ్డి, మూర్తుజా ఖాన్, నరేందర్, సౌజన్య, స్కావెంజర్ మల్లేశ్‌లతో పాటు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



కార్తీక పౌర్ణమి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 24న పాలకుర్తిలో కార్తీక పౌర్ణమి వేడుకలు

గిరి ప్రదక్షిణ, అఖండ జ్యోతి దర్శనం, లక్షదీపోత్సవం

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి

ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు నిర్వహించాలి.స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

ప్రజా వాయిస్ / పాలకుర్తి/నవంబర్ 11

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 24-11-2026న నిర్వహించనున్న గిరి ప్రదక్షిణ, అఖండ జ్యోతి దర్శనం, లక్షదీపోత్సవ కార్యక్రమాల పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలకుర్తి పుణ్యక్షేత్రానికి ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎంతో విశిష్టత ఉందని పేర్కొన్నారు. కార్తీక మాసంలో దీపారాధన, శివారాధన, విష్ణు ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరి ప్రదక్షిణ, అఖండ జ్యోతి దర్శనం, లక్షదీపోత్సవ కార్యక్రమాల్లో పాలకుర్తి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింతగా చాటిచెప్పేలా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 108వ ఫౌండేషన్ డే వేడుకలు

నాగార్జునసాగర్ బ్రాంచ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు

నాగార్జునసాగర్:

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 108వ ఫౌండేషన్ డే వేడుకలను నవంబర్ 11న నాగార్జునసాగర్ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, స్థానికులు కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ రంగంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలను గుర్తుచేసుకున్నారు. ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ, పొదుపు, ఆర్థిక అభివృద్ధి, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో బ్యాంక్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది రామారావు, విష్ణు, స్వాతి, చారి, అకిల్‌తో పాటు డాక్టర్ శ్యామ్ రెడ్డి, లింగారెడ్డి, స్థానికులు, రైతులు పాల్గొని ఫౌండేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.



వికలాంగుల హక్కుల కోసం పోరుబాట.!

- హామీలు అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం
- పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలి
- పోలీసు నిర్బంధాలకు భయపడేది లేదు
- సోమవారం కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి: గిద్దె రాజేష్

ప్రజా వాయిస్,మోతే:

వికలాంగుల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించే సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడికి వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మోతేలో జిల్లేపల్లి శివకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు నెలకు రూ. 6 వేల పెన్షన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, నూతన పెన్షన్లు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచలేరని, హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శివకృష్ణ, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జంజిరాల సుధాకర్, దున్నపోతుల కార్తీక్, భద్రమ్మ, ధన, మూర్తి, దేవయ్య, శారమ్మ, రేణుక, బుల్లి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- 12, 13, 14 తేదీల్లో జూనియర్ బాయ్స్ కబడ్డీ టోర్నమెంట్
- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొననున్న 34 జట్లు
- జిల్లా అధ్యక్షుడు పరశురాం నాయక్, అడ్వైజర్ జగ్గారి వెంకట్ రెడ్డి

ప్రజావాయిస్ / వికారాబాద్:

వికారాబాద్ జిల్లా 36 ఏకేఎఫ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరశురాం నాయక్, జిల్లా అడ్వైజర్ జగ్గారి వెంకట్ రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కబడ్డీ జట్టుకు జెర్సీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీల్లో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నేడు గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 34 జట్లు పాల్గొననున్నాయని తెలిపారు. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను తిలకించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.



అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన అయ్యప్ప సేవా సమితి స్వాములు

ప్రజావాయిస్/తాండూరు/పెద్దేముల్

పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు తాండూర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పెద్దేముల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 13 మంది స్వాములు అయ్యప్ప స్వామి మండల దీక్షను చేపట్టారు.అయ్యప్ప సేవా సమితి గురు స్వాములు వెంకట్ రెడ్డి,శేఖర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో తులసి మాలలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వాములు దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి గురు స్వాములు,అయ్యప్పలు అయ్యప్ప దీక్షను చేపట్టారు.

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

మూడు ఆవాస గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ ఎలికట్టి భరత్

ప్రజా వాయిస్ వేములపల్లి



మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామాలైన ఎరుకలగుట్ట, తాళ్లగడ్డ, రావువారిగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సర్పంచ్ ఎలికట్టి భరత్ మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.మిర్యాలగూడ నుంచి ఎరుకలగుట్ట, తాళ్లగడ్డ, రావువారిగూడెం, పాములపాడు మీదుగా సూర్యాపేట వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించాలని వినతిపత్రంలో కోరారు. ఈ గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ భరత్ తెలిపారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల సమయం వృథా కావడంతో పాటు ఆర్థిక భారం పడుతోందని వివరించారు.గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ మార్గంలో వెంటనే ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించాలని డిపో మేనేజర్‌ను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంటా స్వాతి నర్సయ్య, వార్డు సభ్యుడు ఇట్టమల్ల సందీప్, నాయకులు కంకణాల సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్య ద్వారానే దేశ ప్రగతి సాధ్యం

తొలి విద్యాశాఖ మంత్రి సేవలను స్మరించుకున్న సిద్దులకుంట విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోనీ సిద్దులకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చాటిచెప్పారు.పాఠశాలలో సోమవారం 'జాతీయ విద్యా దినోత్సవ' వేడుకలను అత్యంత ఆకర్షణీయంగా,పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్వతంత్ర భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, మహోన్నత విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈ విద్యా సంబరాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, చేతులు జోడించి ఘన నివాళులర్పించారు.ఆధునిక భారత విద్యా వ్యవస్థకు ఆయన వేసిన పునాదులను, దేశానికి ఆయన చేసిన అమోఘమైన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బానాల నరేందర్‌తో పాటు విద్యార్థినులు మిన్ను, మనోజ్ఞలు జాతీయ విద్యా దినోత్సవ విశిష్టతపై అనర్గళంగా మాట్లాడారు.ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించడమే ఈ రోజు ముఖ్య లక్ష్యమని వారు పేర్కొన్నారు. విజ్ఞానంతోనే అజ్ఞానపు చీకట్లను పారద్రోలి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.ఈ అక్షర చైతన్య కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమారెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, బద్దం సాయిరెడ్డి, మూర్తుజా ఖాన్, నరేందర్, సౌజన్య, స్కావెంజర్ మల్లేశ్‌లతో పాటు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



జర్నలిస్ట్ రవీందర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

అక్కన్నపేటలో నివాకులర్పించి, కుటుంబానికి మనోధైర్యం చెప్పిన వొడితల..

ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్ అక్కన్నపేట

ఇటీవల అకాల మరణం చెందిన టీజీ 24 న్యూస్ ఛానల్ రిపోర్టర్ కాశబోయిన రవీందర్ కుటుంబాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పరామర్శించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామంలోని రవీందర్ నివాసానికి మంగళవారం వెళ్లిన ఆయన, రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తీవ్ర శోకసంద్రంలో ఉన్న రవీందర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యాన్ని నూరిపోశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ, కొద్దిరోజుల క్రితం రవీందర్ అకస్మాత్తుగా మనకు దూరం కావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే, మంచి భవిష్యత్తు ఉన్న ఒక నిజాయితీ గల విలేకరిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. రవీందర్ కుటుంబానికి పార్టీ పరంగా మరియు వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే, ఈ విపత్కర పరిస్థితి నుండి ఆ కుటుంబం త్వరగా కోలుకునేలా ప్రభుత్వం కూడా తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు 'బాసర' పర్యటన రద్దు.. వెనుతిరిగిన అధికారులు, నేతలు!

అత్యవసర సమావేశం కారణంగా రద్దయిన ఐటీ మంత్రి పర్యటన

ఉదయం నుండి బాసరలోనే పడిగాపులు కాసిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి



దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన జ్ఞాన సరస్వతి అమ్మవారి నిలయమైన బాసరకు బుధవారం రావలసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన రద్దయింది.మంత్రి పర్యటన కోసం ఉదయం నుండి ఎదురుచూసిన అధికారులు, పార్టీ నాయకులు ఈ సమాచారంతో వెనుతిరిగారు.ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో సమావేశం కావాల్సి ఉండగా షెడ్యూల్ ప్రకారం,బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్ర పర్యటన ముగించుకుని మంత్రి శ్రీధర్ బాబు బాసరకు చేరుకోవాల్సి ఉంది. అక్కడ బాసర అమ్మవారిని దర్శనం చేసుకుని,ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉంది.అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ (RGUKT) క్షేత్రాన్ని సందర్శించి,అక్కడి విద్యార్థులతో స్వయంగా మాట్లాడి,క్యాంపస్ సమస్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష జరపాల్సి ఉండేది.అయితే, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి పర్యటన అనుకున్న సమయం కంటే బాగా ఆలస్యమైంది.అదే సమయంలో రాజధాని హైదరాబాదులో ఒక అత్యవసర అధికారిక సమావేశం ఖరారు కావడంతో, మంత్రి శ్రీధర్ బాబు తన బాసర పర్యటనను అత్యవసరంగా రద్దు చేసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.ఉదయం నుండి నిరీక్షించిన అధికారలకు నిరాశే ఎదురైంది.మంత్రి రాకను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల ఉదయం నుంచే బాసరకు చేరుకుని భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా పెద్ద సంఖ్యలో బాసరకు తరలివచ్చారు.అలాగే మంత్రికి ఘనస్వాగతం పలికేందుకు మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విట్టల్ రెడ్డిలతో పాటు స్థానిక9 నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.కానీ చివరి నిమిషంలో పర్యటన రద్దు కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ వెనుతిరిగారు.



గో విజ్ఞాన పరీక్షలో 'ఆల్ఫోర్స్' ప్రభంజనం..

రాష్ట్రస్థాయికి 22 మంది ఎంపిక!

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గో విజ్ఞాన పరీక్షలో భైంసాలోని ఆల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ పాఠశాల కీర్తిని చాటారు.ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ మార్కులు సాధించి, 8 మరియు 9వ తరగతులకు చెందిన ఏకంగా 22 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు అర్హత సాధించారు.ఒకే పాఠశాల నుండి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం..రాష్ట్రస్థాయికి ఎంపికైన ఈ విద్యార్థులకు నవంబర్ 15వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని నారాయణగూడలో గల కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఖవీఅ) ప్రాంగణంలోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో తుది పరీక్షను నిర్వహించనున్నారు.ఒకేసారి 22 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికైన విద్యార్థులు మరింత పట్టుదలతో, క్రమశిక్షణతో సన్నద్ధమై అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో జరిగే పోటీల్లోనూ ప్రతిభ చాటి పాఠశాలకు,తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.విద్యార్థులను ఈ స్థాయికి తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని, పాఠశాల సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.